PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 172 | విజయవాడ, శుక్రవారం 24 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 24 January 2025 | Rs

ఉద్యమాలకు ప్రతీకగా 4 జాతాలు

- నెల్లూరులో 3 రోజులు సాంస్కృతిక ఉత్సవాలు
- సిపిఎం రాష్ట్ర మహాసభ ఉద్యమ గీతాల సిడి ఆవిష్కరణలో వి శ్రీనివాసరావు

3

గుకేశ్ @ 4

- ఫిడే ర్యాంకింగ్స్ విడుదల

లాసన్నె: అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) తాజా ర్యాంకింగ్స్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ సత్తా చాటాడు. ఫిడే గురువారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గుకేశ్ 2784 రేటింగ్ పాయింట్లతో 4వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ క్రమంలో భారత్‌నుంచి టాప్ ర్యాంక్‌లో నిలిచిన తొలి గ్రాండ్‌మాస్టర్‌గా గుకేశ్ నిలిచాడు. అంతకుముందు 2779.5పాయింట్లతో ఐదో స్థానంలో ఉండగా.. ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండు ఫిడే టైటిళ్లు సాధించడంతో గుకేశ్ ర్యాంక్ మెరుగైంది.

ఇటీవల ముగిసిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డింగ్ లెరెన్(చైనా)ను చిత్తుచేసి నయా ఛాంపియన్‌గా అవతరించాడు. ఈ క్రమంలోనే టాప్ ర్యాంక్‌కు చేరువయ్యాడు. భారత ప్రభుత్వం ఇటీవల గుకేశ్‌కు ఖేల్‌రత్న అవార్డుతో సత్కరించిన సంగతి తెలిసిందే.

సదస్సులో మాట్లాడుతున్న బివి.రాఘవులు

'వెలిగొండ'కు రూ.4 వేల కోట్లు కేటాయించాలి

- జలసాధన సదస్సులో బివి రాఘవులు

ప్రజాశక్తి- కనిగిరి (ప్రకాశం జిల్లా)

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి వచ్చే బడ్జెట్లో రూ.2 వేల కోట్లు, ఆ తర్వాత సంవత్సరం బడ్జెట్లో మరో రూ.2 వేల కోట్లు కేటాయించకపోతే టిడిపి కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. వెలిగొండ జలాల సాధన సదస్సు సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు అధ్యక్షతన కనిగిరిలోని క్లబ్ రోడ్డులో గురువారం నిర్వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన బివి.రాఘవులు మాట్లాడుతూ దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లా ప్రకాశం జిల్లా అని, అటువంటి షాడో జోన్ ప్రాంత అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. ప్రకాశం జిల్లా వెనుకబాటుతనం పోగొట్టేందుకు వెలిగొండ ప్రాజెక్ట్ ఒక్కటే మార్గమని పూల సుబ్బయ్య పోరాడారని, అందుకే ఆ ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టారని వివరించారు. ఈ ప్రాజెక్టుకు 35 సంవత్సరాల క్రితం అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ అంకురార్పణ చేశారని, ఆయన అల్లుడు చంద్రబాబు శంకుస్థాపనతో సరిపెట్టారని అన్నారు. వైఎస్.రాజశేఖరరెడ్డి భూమి పూజ చేశారని, జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు నీళ్ల కోసం 35 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. విశాఖలో రుషికొండపై జగన్మోహన్‌రెడ్డి తాను ఉండడానికి రూ.500 కోట్లతో భారీ కట్టడం నిర్మించారని, ఈ నిధులతో వెలిగొండ ప్రాజెక్టు ఒక సొరంగం పూర్తయ్యేదని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.ఎనిమిది వేల కోట్లు ఖర్చు చేసినా..ప్రజలకు నీళ్లు ఇవ్వలేని దుస్థితి పాలకుల వల్ల కలిగిందన్నారు. ప్రజల సొమ్మును వథా చేశారని తెలిపారు. అందుకు వారు బాధ్యత వహించాలన్నారు. తక్షణమే వెలిగొండకు నిధులు కేటాయించి ప్రజల రుణం తీర్చుకోవాలని కోరారు. రూ.50 వేల కోట్లు ఖర్చు చేసి పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే ఏడు లక్షల ఎకరాలకు నీరందుతుందని, పది వేల కోట్ల రూపాయల ఖర్చుతోనే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీరందించవచ్చని, ఈ విషయాన్ని చంద్రబాబు గ్రహించాలన్నారు. కృష్ణా జలాలను కుప్పంకు చంద్రబాబు, ఇడుపులపాయకు జగన్ తీసుకు వెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తూ తాము ముఖ్యమంత్రి అన్న సంగతి మరిచిపోయి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రులుగా ఉన్న వారు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. నీళ్లులేని ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎలా స్థాపిస్తారని ప్రశ్నించారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల మిగతా 7లో

రబీ అంతంతే!

తగ్గనున్న 12 లక్షల ఎకరాలు

వరి, పప్పులూ తక్కువే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కరువు, తుపాన్లు, వరదలతో ఈ ఏడాది ఖరీఫ్ నష్టపోగా రెండవ సీజన్ రబీ సైతం అంతంతమాత్రంగానే ఉంది. సీజన్ ముగియడానికి ఇంకా గట్టిగా నెలన్నరే ఉండగా ఇప్పటికీ సాగు నత్తనడకనే సాగుతోంది. రబీ సాధారణ సాగు విస్తీర్ణంలో 12 లక్షల ఎకరాలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికి కావాల్సిన సాధారణ సాగులో సుమారు ఆరు లక్షల ఎకరాల లోటు నెలకొంది. రబీలో అత్యధికంగా ఆహార ధాన్యాలు సాగవుతాయి. నూనెగింజలు, పొగాకు వంటివి ఉన్నా వాటి సాగు తక్కువ. కాగా ఆహారధాన్యాల సాగు ఈ ఏడాది ఏడెనిమిది లక్షల ఎకరాల వరకు ఉండొచ్చని అంచనా. ఖరీఫ్‌లో వర్షాభావం వలన చాలా చోట్ల పంటలు వేయలేదు. ముందస్తుగా వేసిన పంటలు ఎండిపోయి చేతికి రాలేదు. మరోవైపు తుపాన్లు, అకాల వర్షాలు, వరదల వలన వేసిన పంటలు దెబ్బతిన్నాయి. మొత్తమ్మీద ఖరీఫ్‌లో సుమారు 12 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగు కాలేదు. ఉద్యానవన పంటలు సైతం తగ్గాయి.

రబీ సాగు (లక్షల ఎకరాల్లో)

పంట	సీజన్ నార్మల్	ఇప్పటికి సాగైంది	తగ్గుదల శాతం
వరి	19.42	12.12	28
చిరుధాన్యాలు	7.75	5.12	34
పప్పుధాన్యాలు	21.30	16.16	22
ఆహారధాన్యాలు	48.47	33.90	30
నూనెగింజలు	3.45	1.27	63
మొత్తం పంటలు	**53.80**	**37.07**	**30**

టార్గెట్ ఘనం

ఖరీఫ్ నష్టాల తరుణంలో రబీలో సాగును పెంచేందుకు ప్రభుత్వం భారీ లక్ష్యాలు పెట్టుకుంది. 57.67 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయిస్తామని రంగంలోకి దిగింది. సాధారణ సాగు విస్తీర్ణం మాత్రం 53.89 లక్షల ఎకరాలు. పరిస్థితులను బేరీజు వేస్తే కనీసం సాధారణ సాగు కూడా అయ్యేటట్లు లేదు. జనవరి 22 నాటికి కావాల్సిన సాగులో 5.80 లక్షల తగ్గుదల ఉంది. ఇప్పటికి మొత్తం సీజన్‌లో కావాల్సిన సాగులో సుమారు 17 లక్షల ఎకరాల లోటు నెలకొంది. సాధారణంగా రబీలో చిరు ధాన్యాలు, పప్పుధాన్యాలను డిసెంబర్ చివరికల్లా రైతులు పూర్తి స్థాయిలో సాగు చేస్తారు. జనవరి తర్వాత అడపాదడపా వేస్తారంతే. రబీలో పప్పుశనగల సాగు ఎక్కువ. ఈపాటికి వాటి సాగు పూర్తి చేస్తారు. ఈ తడవ వాటి సాగు సైతం తగ్గింది. మినుములు, పెసలు, అలసందలు అన్నీ తగ్గాయి. చిరుధాన్యాల్లో మొక్కజొన్న ఇప్పటి వరకు బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా, సీజన్ చివరాఖరు కొచ్చేసరికి ఆ పంట కూడా సాధారణ సాగు కంటే తగ్గేటట్లుంది.

నీటి కొరత

వరికి గోదావరి డెల్టాలోనే నీటి గ్యారంటీ ఉంది. ప్రధాన ప్రాజెక్టుల్లో నీరు లేని కారణంగా కృష్ణా డెల్టాలో రెండవ పంట వరిని వేయొద్దన్నారు. ఇక్కడ కేవలం ఆరుతడి పంటలకే నీళ్లిస్తున్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా వరికి నీరు బంద్ చేశారు. విద్యుత్ మోటార్ల కింద, భూగర్భజలాలు ఉన్న చోట్ల మాత్రమే... అదీ అరకొరగా వరి వేస్తున్నారు. సీజన్ ముగింపు దశకొచ్చినందున, జనవరి ముగుస్తున్నందున ఇక కొద్ది మొత్తంలోనే మెట్ట పంటలు సాగయ్యే అవకాశముంది.

సిఆర్‌డిఎ కమిషనర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటి (ఎపిసిఆర్‌డిఎ) కమిషనర్‌గా కన్నబాబు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అదనపు కమిషనర్లతో చర్చించారు. ఆ తర్వాత సిఆర్‌డిఎ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల వివరాలు, అధికారుల బాధ్యతలు అడిగి తెలుసుకున్నారు. తొలిరోజు కావడంతో చర్చల అనంతరం ఆయన బయటకు వెళ్లిపోయారు. సీనియర్ ఐఎఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా కన్నబాబును సిఆర్‌డిఎ కమిషనర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ కమిషనర్‌గా ఉన్న కాటంనేని భాస్కర్‌ను ఐటిశాఖకు బదిలీ చేశారు.

జమ్మూకాశ్మీర్‌లో అంతుచిక్కని వ్యాధి

- 45 రోజుల్లో 17 మంది మృతి
- కంటైన్‌మెంట్ జోన్‌గా ప్రకటించిన అధికారులు

7

కార్పొరేట్ 'సమీకరణ'

- ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు భూములు

2

ఎపి బ్రాండ్ @ దావోస్

- భేటీలు, సదస్సులు, చర్చలతో రాష్ట్రానికి గుర్తింపు
- దిగ్గజ సంస్థలకు చంద్రబాబు ఆహ్వానం
- ముగిసిన పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో సిఎం చంద్రబాబునాయుడు

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షణ, దిగ్గజ సంస్థలకు ఆహ్వానం, చర్చలు, సదస్సులతో దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఎపి బృందం పర్యటన విజయవంతంగా ముగిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మూడు రోజులపాటు జరిగిన పర్యటనలో మంత్రులు నారా లోకేష్, టి.జి.భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గురువారం అర్ధరాత్రికి చంద్రబాబు తదితరులు న్యూఢిల్లీ చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నానికి ఉండవల్లి చేరుకుంటారు. మంత్రి లోకేష్ బృందం దావోస్‌లోనే ఉంది. ఎపి బ్రాండ్‌ను ప్రమోట్ చేయడంలో విజయవంతమయ్యామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించామని, వారు పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా ప్రపంచంలో అత్యున్నత స్థానంలో ఉన్న 15 వాణిజ్య సంస్థల అధిపతులతో రాష్ట్ర బృందం చర్చలు జరిపింది. వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధి కోసం కొత్తగా తీసుకొచ్చిన పాలసీలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికలు, పెట్టుబడిదారులకు వివరించి స్వయంగా వచ్చి పరిశీలించాలని కోరారు. తొలిరోజు ఎపిలో పెట్టుబడులపై స్విట్జర్లాండ్ దౌత్యవేత్త మృదుల్ కుమార్‌తో చర్చించారు. స్విస్‌మెన్, ఓర్లీకాన్, అంగ్స్ ఫిస్టర్స్, స్విస్ టెక్స్‌టైల్స్ సిఇఓలతో చర్చలు జరిపారు. రెండో రోజు భారత పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) ఏర్పాటు చేసిన ప్రత్యేక సెషన్లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై సిఎం, మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. ఎపిలో మానవ వనరుల లభ్యత అధికంగా ఉందని తెలిపారు. భవిష్యత్ నాయకులను తయారు చేసేందుకు అమరావతిలో ఏర్పాటు చేసే గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్(జిఎల్‌సి) ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో అతిపెద్ద సముద్ర రవాణా సంస్థల్లో ఒకటైన మార్స్క్ కంపెనీ సిఇఓ విన్సెంట్ క్లర్క్‌తో జరిగిన చర్చల్లో ఎపికి ఉన్న సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంపై చర్చించారు. ఎపిలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ పెట్టాలని సిస్కో సిఇఓ చుక్ రాబిన్స్‌ను కోరారు. విశాఖలో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని దక్షిణ కొరియాకు చెందిన మిగతా 7లో

పిఎంఎవై అర్బన్ 2.0కు నెలాఖరులోగా దరఖాస్తులు

- గృహ నిర్మాణశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 స్కీమ్ కింద సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఈనెల 30వ తేదీలోగా చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ పేర్కొంది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హత కలిగిన కుటుంబాలకు చెందిన వారు 4బి అప్లికేషన్ ఫారమ్ భర్తీ చేసి గ్రామ వార్డు సచివాలయంలోని వార్డు ఎమినిటీస్ సెక్రటరీ/ వార్డు ప్లానింగ్ సెక్రటరీ/ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. అర్జీదారులు వారి దరఖాస్తుతో పాటు వారి భాగస్వామితో కలిసి ఉన్న ఫోటోను విధిగాయఅతికించాల్సి ఉంటుంది. ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్‌కార్డు, విద్యుత్తు బిల్లు, హౌస్ ట్యాక్స్‌బిల్‌కాపీ, ఓటరు ఐడి, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల నకళ్లు, కుల ధృవీకరణ పత్రం, వ్యక్తిగత బ్యాంకు ఖాతా మొదటి పేజీ (ఆధార్ అనుసంధానమై ఉండాలి) ఇంటి పట్టా లేదా సొంత స్థల డాక్యుమెంట్ లేదా పొజిషన్ సర్టిఫికెట్, అంగవైకల్యం ఉన్న వారు సంబంధిత వైద్యుని వద్ద తీసుకున్న సర్టిఫికెట్ జెరాక్స్‌కాపీ జత చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటిపి కోసం ఫోన్ నెంబరు ఆధార్ కార్డుతో లింక్ కావాలని తెలిపారు.

కృష్ణా నదీ జలాల పంపకాలపై సుప్రీంకు ఏపి ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నదీ జలాల పంపకాల వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీకోర్టును ఆశ్రయించింది. కృష్ణా ట్రిబ్యునల్ ముందు దాఖలైన రెండు రిఫరెన్స్‌ల విచారణ వ్యవహారంపై పిటిషన్ దాఖలు చేసింది. ఏపి, తెలంగాణ రెండు రాష్ట్రాల మధ్యనే కృష్ణా నదీ జలాల పంపకం జరగాలని 2023 అక్టోబర్ 23న జారీ చేసిన కేంద్ర ప్రభుత్వ గెజిట్‌ను ప్రభుత్వం సవాల్ చేసింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ఏపి ప్రభుత్వం మెన్షన్ చేసింది. ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రస్తావించారు. ఫిబ్రవరి 19న ట్రిబ్యునల్ రెండో రిఫరెన్స్‌నే విచారణకు తీసుకుంటామని చెప్పిన విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తమ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ చేపట్టాలని కోరారు. ఏపి ప్రభుత్వం ప్రస్తావనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, తదుపరి విచారణను ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు చేపట్టనున్నట్లు ప్రకటించింది. 2023 అక్టోబర్ 23న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌పై ఇటీవల బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయం విడుదల చేసింది. విభజన చట్టం ప్రకారం నీటి వాటాల పంపకంపై రెండు రిఫరెన్స్‌లను ట్రిబ్యునల్‌లో ఏపి, తెలంగాణ రెండు రాష్ట్రాలూ దాఖలు చేశాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాలు చేస్తూ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇప్పటికే తీర్పు వెలువరించింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత తలెత్తిన కృష్ణా నదీ నీటి పంపకాలపై ట్రిబ్యునల్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. కృష్ణా నది తమ భూభాగంలోనే ఎక్కువ ప్రవహిస్తుందని, కాబట్టి రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తమకు 70 శాతం నీటి వాటా ఉండాలని, లేని పక్షంలో రెండు రాష్ట్రాలకు 50 శాతం చొప్పున పంపిణీ చేయాలని తెలంగాణ కోరింది. అయితే ఈ వ్యవహారంపై ట్రిబ్యునల్ తేల్చక ముందే, 2023 అక్టోబర్ 10న కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్యనే నీటి పంపకాలను తేల్చాలని, దానిపైనే విచారణ చేపట్టాలని నోటిఫికేషన్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి

- మంత్రి నిమ్మల రామానాయుడు
- 2026 జులై నాటికి నిర్వాసితులను తరలించాలని ఆదేశం

ప్రజాశక్తి - పోలవరం

ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న ఆయనకు ఇంజనీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, సిఇ కె.నరసింహమూర్తి, సిఇ ఆర్.రామచంద్రరావు, మెగా ప్రతినిధి అంగర సతీష్ స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయ ప్రాంతం నుంచి స్పిల్‌వే ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రాజెక్టులో నూతన డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతంలో ఛానల్ 800 వద్ద ప్యానెల్లో టి16 ప్లాస్టిక్ కాంక్రీటు పనులు, 750 ఛానల్ వద్ద ట్రెంచ్ కటింగ్ పనులు, ట్రెంచ్ కటింగ్ యంత్రాలను, గ్రాబ్ కటింగ్ యంత్రాలను, అనంతరం డీశాండింగ్ యంత్రాన్ని, బెంటోనైట్ ద్రవాల ట్యాంకులను, ఆ ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌ను పరిశీలించారు. బావర్ మిగతా 6లో

ప్రాణాల మీదకు తెస్తున్న ఫిజికల్ టెస్టులు

- పరుగు పందెంలో మరో కానిస్టేబుల్ అభ్యర్థి మృతి

ప్రజాశక్తి- ఆరిలోవ (విశాఖపట్నం)

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామాకాలకు నిర్వహిస్తున్న ఫిజికల్ టెస్టులు అభ్యర్థుల ప్రాణాల మీదుకు తెస్తున్నాయి. పరుగు పందెంలో బుధవారం పాల్గొన్న విజయనగరం జిల్లా రాజేరుకు చెందిన కానిస్టేబుల్ మరణించిన ఘటన మరవక ముందే అటువంటి ఘటనే విశాఖ జిల్లాలో చోటు చేసుకుంది. విశాఖ కైలాసగిరి పోలీసు మైదానంలో జరిగిన ఫిజికల్ టెస్ట్‌లో కానిస్టేబుల్ అభ్యర్థి అస్వస్థతకు గురై మృతి చెందారు. అనకాపల్లి జిల్లా ఎస్‌పి తుహిన్‌సిన్హా వెల్లడించిన వివరాల మేరకు... పాత డెయిరీ ఫారం రవీంద్రనగర్‌కు చెందిన కేటగాని వెంకట శ్రావణ్ కుమార్ (24) పిఎంటి, పిఇటి ప్రాథమిక పరీక్షలో 1600 మీటర్ల పరుగు పందెలో పాల్గొని అస్వస్థతకు గురయ్యారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను వైద్యులు పరీక్షించి ప్రాథమిక చికిత్స నిమిత్తం విమ్స్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రావణ్ కుమార్ మరణించారు. ఆయన పుట్టిన రోజే ఈ ఘటన చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

లాస్ ఏంజెల్స్‌లో తాజా కార్చిచ్చు

- 9వేల ఎకరాల దగ్ధం
- 50వేల మంది తరలింపునకు ఆదేశాలు

కాస్టాటిక్, కాలిఫోర్నియా : అమెరికాలోని సంపన్నుల ప్రాంతమైన లాస్‌ఏంజెల్స్‌లో మూడు వారాల క్రితం చెలరేగిన దావానలం ఇంకా పూర్తిగా శాంతించక మునుపే మరో ప్రాంతంలో తాజాగా కార్చిచ్చు మొదలైంది. గాలులు కూడా ఉధృతంగా వీస్తుండడంతో మంటలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయని అధికారులు తెలిపారు. విమానాల ద్వారా వాటర్ బాంబులను జార విడుస్తూ మంటల ఉధృతి తగ్గించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా, ఈ మంటల ముప్పుతో దాదాపు 50వేల మందిని ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. లాస్‌ఏంజెల్స్‌కు ఉత్తరంగా పర్వత ప్రాంతాల్లో కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం ఉదయం ప్రాంభమైన ఈ మంటలు ఒక రోజులోనే దాదాపు 9వేల ఎకరాలను దగ్ధం చేశాయి. ప్రముఖ రిక్రియేషన్ ఏరియా అయిన కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో దాదాపు 41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు, పొదలు పూర్తిగా మాడి మసైపోయాయి. గత మూడు వారాలుగా కార్చిచ్చు చెలరేగుతున్న ఈటన్, పాలిసాడ్స్ ఏరియాలకు ఈ ప్రాంతం 64కిలోమీటర్ల దూరంలో వుంది. మరోవైపు పెద్ద ఎత్తున దాదాపు 4వేల మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు హోరాహోరీ శ్రమిస్తున్నారు. ఇంత చేస్తే 14శాతం మేరా మంటలను అదుపు చేయగలిగారు. ఈ పరిస్థితుల్లో లాస్‌ఏంజెల్స్, వెంటురా కౌంటీల్లో శుక్రవారం ఉదయం 10గంటల వరకు రెడ్ ఫ్లాగ్ హెచ్చరికలు జారీ చేశారు. 5వ నెంబరు అంతర్రాష్ట్ర రహదారిలో కొన్ని భాగాలను మూసివేశారు. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత తెరుస్తామని లాస్‌ఏంజెల్స్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా చెప్పారు.

కార్పొరేట్ 'సమీకరణ'

ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు భూములు

పటాడీ

ప్రైవేటు రంగంలో ప్రపంచస్థాయి సౌకర్యాలతో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకోసం కార్పొరేట్లు నేరుగా భూములు సమీకరించుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల పాలసీలో ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కార్పొరేట్లు కోరుకున్న చోట భూములను సమీకరించుకోవచ్చని, దీనికి అవసరమైన పూర్తిస్థాయి సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపింది. అయితే, వీటికి సంబంధించిన విధివిధానాలను మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక పార్కుల్లో కూడా కార్పొరేట్లు కోరుకున్నంత భూమిని కేటాయిస్తామని తెలిపింది. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కుల కోసం మూడు నమూనాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మొదటి నమూనాలో అవసరమైన మొత్తం భూమిని ప్రైవేటు వ్యక్తులు, లేదా సంస్థలే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీనికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. రెండవ పద్ధతిలో పాక్షికంగా ప్రభుత్వం కొంత భూమిని కేటాయిస్తుంది. మిగిలిన భూమిని కార్పొరేట్లు ఏదో పద్ధతిలో సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీనికోసం ప్రభుత్వ



ఏజెన్సీకి కార్పొరేట్లు అభివృద్ధి చేసిన భూమిలో కొంత కేటాయించాల్సి ఉంటుంది. మూడవ పద్ధతిలో నూరుశాతం ప్రభుత్వ భూమిని కార్పొరేట్లకు ఇచ్చి, అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు కల్పించే బాధ్యతను అప్పగిస్తారు.

రైతుల పరిస్థితి ఏమిటి

రాజధాని నిర్మాణానికి చేపట్టిన విధంగానే భూ సమీకరణతో తీసుకోనున్నట్లు పాలసీలో చెప్పారు. అంతకుముందు అమరావతి రాజధానికి భూమిని ఒకచోట తీసుకున్న సమయంలోనే అనేక అడ్డంకులు, ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికీ భూమిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపులు కొలిక్కిరాకపోగా, వారికి ఇవ్వాల్సిన ఆర్థిక పరిహారం కూడా పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. దీనిపై ఇంకా అనేక విమర్శలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఇక కొత్త పాలసీలో కార్పొరేట్లే నేరుగా భూములు సమీకరించుకోవచ్చని పేర్కొన్నారు. అయితే, దీనికోసం ఎటువంటి నిబంధనలు రూపొందించలేదు. 'పారిశ్రామిక పార్కుల కోసం రైతుల నుండి చేసే భూసమీకరణకు నిబంధనలు (ఫ్రేమ్ వర్క్)ను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు. వాటి గురించి ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

ఎనిమిది రకాల పార్కులు

ప్రైవేటు పారిశ్రామిక పార్కులను ఎనిమిది రకాలుగా పేర్కొన్నారు. వీటిలో అధికభాగం పరిశ్రమల పాలసీలో, ఎంఎస్ఎంఇ పాలసీల్లో పేర్కొన్న విధంగానే ఉన్నాయి. లార్జ్ పార్కు, మెగా పార్కు, ఎంఎస్ఎంఇ పార్కులు, అందులో మీడియం, చిన్న, సూక్ష్మ పార్కులను విడివిడిగా చూపించారు. తక్కువ భూ విస్తీర్ణంలో ఏర్పాటు చేసే నానో పార్కులను ప్రత్యేంగా పేర్కొన్నారు. కేంద్రం భవిష్యత్తులో ప్రకటించే విధానాలు ఈ పార్కులకు వర్తిస్తాయని తెలిపింది.

ఎపిఐఐసి భూమి తక్కువే

రాష్ట్రంలోని మొత్తం 25 జిల్లాలకుగాను కేవలం 14 జిల్లాల్లో మాత్రమే ఎపిఐఐసి భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. అది కూడా కేవలం 44 వేల ఎకరాలు మాత్రమే. చిత్తూరులో 2,297 ఎకరాలు మాత్రమే కనిపిస్తుండగా, ప్రకాశం జిల్లాలో 1,411 ఎకరాలు, పుట్టపర్తిలో 4,242 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఉన్న భూమి చాలదని అధికారులు అంటున్నారు.

13 రకాల పార్కులు

చివరకు ప్రయివేటు పారిశ్రామిక పార్కుల్లో కూడా13 రకాల పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రైవేటు పార్కులకు అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. వీటిలో బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, బొమ్మల తయారీ, విద్యుత్ వాహనాలు, సెమీకండక్టర్, రక్షణ-ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రో ప్రాసెసింగ్, లెదర్, టెక్స్‌టైల్స్, స్పెసిఫిక్ ప్రోడక్ట్స్, డ్రోన్స్ పార్కులున్నాయి.

గుర్తింపు కార్డు లేక పోయినా కౌలు రైతు పేరుతోనే ఇ-క్రాప్ నమోదు

- వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జగ్గారావు తెలిపారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డు రాకపోయినా సాగు చేస్తున్న కౌలురైతుల పేరుతోనే ఇ-పంట నమోదు చేయాలని నిబంధనల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. వడ్డేశ్వరంలోని కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కౌలు రైతుల విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా జగ్గారావు ప్రసంగించారు. భూయజమాని పేరుతో ఇ-పంట నమోదైన మార్పు చేయడానికి కౌలు రైతుల పేర్లు నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. కిందిస్థాయి అధికారులు పొరపాటుగా భూ యజమాని పేరుతో నమోదు చేసినట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు, ఇ- పంట నమోదైతేనే పంటల నష్టపరిహారం, పంటల బీమా చివరకు పంట అమ్ముకునే అవకాశం వస్తుందన్నారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయశాఖ కొన్ని జీఓలు , నిబంధనలు మార్పు చేస్తూ తీసుకొచ్చిన విషయాల గురించి వివరించారు. ఇ-పంట నమోదు గురించి కౌలు రైతులను విస్తృతంగా ప్రచారం చేసి చైతన్యం తీసుకురావాలన్నారు. ఇ-పంట నమోదులో క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యల పరిష్కారానికి కైలు రైతుల సంఘం నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయశాఖకు , కౌలు రైతులకు వారధిలాగా వ్యవహరించి కౌలు రైతులకు మేలు జరిగేటట్లు కృషి చేయాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, కొత్త చట్టాలు వాటి ప్రభావం వ్యవసాయం మీద, కౌలు రైతుల మీద ఎలాంటి ప్రభావం కలిగిస్తుందో అందుకు గల ప్రత్యామ్నాయాలను వివరించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాలు వాటి అనుభవాలను వివరించారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

అసమానతలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు

'మహిళా పురోగతి-సవాళ్ల'లో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

ప్రజాశక్తి- నెల్లూరు

మహిళ పట్ల అసమానతలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. వాటిని మహిళలంతా ఐక్యంగా కొట్టాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘ కాలం తర్వాత నెల్లూరు నగరంలో సిపిఎం రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలోని మినీ హాల్లో 'మహిళా పురోగతి-సవాళ్లు' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని పెట్టాలన్న ప్రయత్నం, పితృస్వామ్యాన్ని రక్షించేటటువంటి సనాతన ధర్మాన్ని రక్షించడం అనే పేరుతో మహిళలపై అసమానతలను ప్రోత్సహించేట టువంటి ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడా యన్నాయని వివరించారు. మహిళలు ప్రగతి సాధిస్తేనే ఏ సమాజమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు బయటకు రావడానికి, చదువుకునేందుకు అడ్డంపడిన మనుస్మృతి తిరిగి మళ్లీ దేశంలో తిష్టవేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రదాయల పేరుతో మహిళలను వెనక్కు నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆడపిల్లలపై పెద్ద ఎత్తున అత్యాచారాలు, వేధింపులు, కుటుంబ

సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

హింసలు పెరుగుతున్నాయని తెలిపారు. ఏటా క్రైం రేట్ పెరిగిపోతుందన్నారు. వేధింపులు, అత్యాచారాలు, కుటుంబ హింసలను అరికట్టాల్సి ఉందని తెలిపారు. సోషలిజం సాధనతోనే చైనా దేశంలో ఆర్థికంగా ముందుకు అడుగులు పడ్డాయన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, మద్యం వల్ల మహిళలు వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. నిత్యావసర సరుకులు సక్రమంగా సరఫరా కావడం లేదని, మైక్రో ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలతో మహిళలను వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని, చివరి రోజు జరిగే ర్యాలీ, బహిరంగ సభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.శివకుమారి, కార్యదర్శి షేక్ .మస్తాన్‌బీ, శ్రామిక మహిళా కన్వీనర్ డి.అన్నపూర్ణమ్మ, డికె కళాశాల విశ్రాంత లెక్చరర్ డి.భారతి, ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.పద్మ, ఎన్‌వి సుబ్బమ్మ, ఐద్వా రూరల్ నాయకులు ఎస్.వరలక్ష్మి, షేక్ షంషాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల పరిరక్షణకు సమరశీల పోరాటాలు

- కెఎస్ లక్ష్మణరావు, సిహెచ్ .నరసింగరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల పరిరక్షణకు విశాల ఐక్య పోరాటాలు ఆవశ్యకమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో గురువారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను లక్ష్మణరావు, సిహెచ్ నర్సింగరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 85 లక్షల కోట్ల విద్యుత్ సంస్థలను, ప్రజా సంపదను ధారాదత్తం చేసే విధానాలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు సమరశీల పోరాటాలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల డిఎ బకాయిలు, పాత పెన్షన్ విధానం అమలు, కాంట్రాక్టు కార్మికులకు పిఆర్‌సి అరియర్స్, సమాన వేతనాలతోపాటు పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, కోశాధికారి ఎల్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, డిస్కం రీజియన్ నాయకులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జె.రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముజఫర్ అహమ్మద్ పాల్గొన్నారు.

ఉక్కు విలీనానికి సెయిల్ సిద్ధంగా లేదు

- కేంద్ర సహాయ శాఖ మంత్రి శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కును విలీనం చేసుకోలేమని, ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి, మేనేజ్‌మెంట్ తమకు అప్పగిస్తే నష్టాల నుంచి బయటకు తీసుకొస్తామని సెయిల్ యాజమాన్యం చెప్పిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపలేకపోవడమే నష్టాలకు కారణమని, కార్మికులకు జీతాలిచ్చే పరిస్థితి కూడా లేకపోవడానికి యాజమాన్యమే కారణమని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని బిజెపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది అక్టోబర్‌లో 15 శాతం, నవంబర్, డిసెంబర్ నెల జీతాలు అసలు చెల్లించలేదని చెప్పారు. జీతాలు చెల్లించేందుకు అతి త్వరలో రూ.238 కోట్లతో చర్యలు తీసుకుంటామన్నారు. అవసరానికి మించి సామర్థ్యం లేకపోయినా రాయచూరులో రూ.2,200 కోట్లు పెట్టుబడులు పెట్టారన్నారు. 2024లో దాన్ని అమ్మకం పెట్టి రూ.400 కోట్లు బ్యాంకుకు వడ్డీలు కట్టారని చెప్పారు. భవిష్యత్తులో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదని స్పష్టం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రయివేటీకరణ కాకుండా మరికొన్ని ప్యాకేజీలు కేంద్రం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. వెయ్యి మంది కార్మికులను విఆర్‌ఎస్‌కు బలవంతంగా పంపుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తమని ఖండించారు.

గోపాలమిత్రల రాష్ట్ర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గోపాలమిత్ర సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ 23 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన అసోసియేషన్ రాష్ట్ర మహాసభ కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులుగా సిహెచ్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఐ.ఐజాక్, సంయుక్త కార్యదర్శిగా బి.నానాజీ, కోశాధికారిగా జి.ఈశ్వరయ్య, గౌరవ సలహాదారులుగా కె.వెంకటరమణ, కె.గణపతిరావు, ఉపాధ్యక్షులుగా కె.వెంకటేష్, పి.నాగవేణి, ఎం.ప్రసాదరావు, ఆర్‌డిఎస్ అప్పారావు, టి.లక్ష్మీనారాయణ, జి.రాంబాబు, ఎస్.నెహ్రూ, ఎస్.నిజాంవలి, కార్యదర్శులుగా కె.శ్రీను, పి.సన్యాసినాయుడు, సిహెచ్.సురేష్, ఎస్.పిచ్చిరెడ్డి, కె.శ్రీనివాస్, జి.కృష్ణమూర్తి, ఎం.చంటిబాబు, పి.పున్నారావు ఎన్నికయ్యారు. సమావేశానికి 20 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభల్లో రాష్ట్ర కమిటీ చేసిన కృషి, సచివాలయాల నేపథ్యంలో గోపాలమిత్రల కొనసాగింపు, వెయిటేజ్ సాధించడం, ఇతర సమస్యలు, ఇన్సెంటివ్ బకాయిలు, చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా, అర్హతలను బట్టి పోస్టులు, పనికి గుర్తింపు తదితర అంశాలపై చర్చ జరిగింది. సమస్యలపై జిల్లాల్లో ఫిబ్రవరి 3వ వారంలో ఆందోళనలు నిర్వహించి సామూహిక వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. మార్చి 2వ వారంలో విజయవాడలో ఆందోళన నిర్వహించాలని తీర్మానించారు. అంతకు ముందు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, ఎపి కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మహాసభనుద్దేశించి ప్రసంగించారు. గోపాలమిత్రలకు సంఘీభావం తెలిపారు.

6న మంత్రి వర్గ సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫిబ్రవరి 6న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరిగే ఈ సమావేశంలో దావోస్ పర్యటన, పెట్టుబడులు రాక, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, అమరావతి నిర్మాణం, పోలవరం డయా ఫ్రమ్‌వాల్, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, వాట్సాప్ గవర్నెన్స్ వంటి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం.

అమృత యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లులోని అమృత విశ్వవిద్యాలయ విద్యార్థి గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతానికి చెందిన కెకె నవదేవ్ అమృత యూనివర్సిటీ హాస్టల్‌లో ఉంటూ ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తోటి విద్యార్థులు కాలేజీకి వెళ్లాక తన గదిలోనే నవదేవ్ ఉరేసుకున్నారు. అనంతరం గమనించిన కాలేజీ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎయిమ్స్‌కు తరలించారు. మృతుని తల్లిదండ్రులు వచ్చాక పోస్టుమార్టం నిర్వహించి అప్పగిస్తామని, వారి ఫిర్యాదు అధారంగా దర్యాప్తు చేస్తామని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ చెప్పారు. ఘటనా స్థలిలో మృతుడు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నామని, అతను రాసిన ఇతర నోట్ పుస్తకాలను సైతం పరిశీలన కోసం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఒప్పందాలపై విచారణకు ఆదేశించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదానీతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు రహస్య అజెండా లేకపోతే రాష్ట్ర ప్రజలకు భారంగా మారిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ఈ వ్యవహారంపై ఎసిబితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రతిపక్షంలో ఉండగా అదానీ చంద్రబాబుకు శత్రువు అని, అధికారం చేపట్టగానే మిత్రుడయ్యాడని పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ఒప్పందంలో గత ముఖ్యమంత్రి జగన్ రూ.17వందల కోట్లు ముడుపులు అందుకున్నారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ స్పష్టంగా నివేదిక ఇస్తే, చంద్రబాబు కచ్చితమైన సమాచారం కావాలని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఏ సమాచారంతో విద్యుత్ ఒప్పందాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారని ఆమె ప్రశ్నించారు. అన్ని ఆధారాలు కళ్ల ముందే కనిపిస్తుంటే కచ్చితమైన సమాచారం కావాలని అడగటం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు.

అవకాశాలు అందిపుచ్చుకోండి

- దావోస్ వేదికగా పెట్టుబడిదారులకు భారత బృందం విజ్ఞప్తి
- చివరిరోజు మీడియా మీట్‌లో ఐదు రాష్ట్రాల ప్రతినిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇండియాలో ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులు అందిపుచ్చుకోవాలని, ఆర్థిక సంస్కణలు, స్థిరమైన వృద్ధితో 2028 నాటికి భారత్ అగ్రగామి దేశంగా మారబోతోందని దావోస్ వెళ్లిన ఇండియా ప్రతినిధి బృందం పేర్కొంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు ముగింపు సందర్భంగా ఇండియన్ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో భారత దేశ ప్రతినిధి బృందం పాల్గొంది. ఈ బృందంలో కేంద్రమంత్రి అశ్వనీవైష్ణవ్, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేరళ, తమిళనాడు రాష్ట్రాల మంత్రులు పాల్గొన్నారు. బృందం తరుపున చంద్రబాబునాయుడు మీడియాతో మాట్లాడారు. దావోస్ సమావేశంలో తొలిసారి టీమిండియా భావనతో అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా సదస్సులో పాల్గొన్నాయని తెలిపారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాలన్నీ వేర్వేరుగా పోటీపడినా పరస్పరం సహకరించుకుని భారతదేశ సమైఖ్య స్ఫూర్తిని చాటాయని చెప్పారు. మోడీ నాయకత్వంలో ఇండియా బ్రాండ్ బావుందని, బ్లూమ్ బెర్గ అంచనాల ప్రకారం 2028 నాటికి పెరుగుతున్న జిడిపి వృద్ధితో భారత్ అగ్రగామి దేశంగా ఎదుగుతుందని తెలిపారు. ఆర్థిక సంస్కరణలు స్థిరమైన వృద్ధి, ఆధునాతన సాంకేతిక వినియోగంలో భారత్ ఉన్నతస్థానంలో ఉందని అన్నారు. ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, ఇతర కీలక రంగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీకి కేంద్రంగా భారతదేశం ఆవిర్భవిస్తుందని పేర్కొన్నారు. టెక్ కంపెనీల సిఇఓలు ఎక్కువమంది భారత మూలాలకు చెందినవారని వివరించారు. తాను 1997 నుండి దావోస్ సమావేశాలకు హాజరవుతున్నానని, ఇప్పుడు పోటీ పెరిగిందని తెలిపారు.. చివరిరోజు చంద్రబాబు స్విస్ వ్యవస్థాపకులు ఆంద్రే హాప్‌మన్, ఎన్‌డిపి అధిపతి అచిమ్ స్టైయినర్, సిఎన్‌ఎన్ బెకీ అండర్సన్‌తోనూ చర్చించారు. అనంతరం ఇండియా బయలుదేరారు.

జలహారతికి లైడార్ సర్వే

అనుమతించిన కేంద్ర అటవీశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం కోసం నల్లమల టైగర్ రిజర్వు ఫారెస్టులో టన్నెల్ ఏర్పాటుకు సంబంధించిన లైడార్ సర్వేకు కేంద్రం, అటవీశాఖ నుండి అనుమతి వచ్చింది. వీలైనంత త్వరలో సర్వే ప్రారంభించనున్నారు. అనంతరం డిపిఆర్ రూపొందించి కేంద్రం అనుమతి కోసం పంపనున్నారు. గోదావరి నుండి లింకు ప్రాజెక్టు ద్వారా 300 టిఎంసిలు బనకచర్లకు తరలించాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం నుండి బనకచర్లకు నీరు తీసుకెళ్లాలంటే టైగర్ రిజర్వు ఫారెస్టులో నుండి కాలువ తవ్వాలి. ఇప్పటికే అటవీ ప్రాంతంలో వెలిగొండ టన్నెల్ తవ్వకాలు సాగుతున్నాయి. మరలా కొత్తగా తవ్వకాలంటే మొత్తం రిజర్వు ఫారెస్టుకు ఇబ్బంది ఏర్పడుతుంది. పర్యావరణ ఇబ్బందులూ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 33 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాలని నిర్ణయించారు. దీనికి సర్వే చేయాలంటే టైగర్ ఫారెస్టులో కొంత మానవ కదలికలు అవసరం ఉంటుంది. దీనివల్ల వన్యప్రాణి సంరక్షణకు ఇబ్బంది ఏర్పడుతుంది. దీంతో మొత్తం లైడార్ సర్వే నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని అటవీశాఖ, కేంద్రాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు కోరారు. దీనికి రెండు రోజుల క్రితం అనుమతి వచ్చింది. లైడార్ సర్వే పూర్తయితే టన్నెల్‌కు సంబంధించిన డిపిఆర్ రూపొందించి కేంద్రానికి నివేదిక పంపాల్సి ఉంది. కేంద్రమూ సహకరిస్తే అతి త్వరలో ప్రాజెక్టు పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు.

5న రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఫీజు పోరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యార్థుల ఫీజు బకాయిలు నాలుగువేల కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న ఫీజు పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు విడుదల అంశంపై ప్రభుత్వం స్పందించకపోతే పోరు తప్పదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 5న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జిల్లా కలెక్టర్లను కలిసి విజ్ఞప్తులు చేస్తామని తెలిపారు. విద్యాదీవెనకు రూ.2800 కోట్లు, వసతి దీవెనకు రూ.1100 కోట్లు మొత్తం రూ.3900 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు.

ఉద్యోగులను నమ్మించి నట్టేట ముంచారు : చంద్రశేఖరరెడ్డి

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చిన కూటమి నాయకులు నమ్మించి నట్టేట ముంచారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు ఎన్.చంద్రశేఖరరెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి వేయకపోవడం న్యాయమా అని ప్రశ్నించారు. ఏ పెన్షన్ స్కీము ఉందో ఉద్యోగులకు అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, అసలు ప్రభుత్వ నిర్ణయం ఏమిటో కూడా చెప్పడం లేదని తెలిపారు. సిపిఎస్, జిపిఎస్, ఓపిఎస్‌లపై స్పష్టత ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రభుత్వ బకాయిలు రూ.26 వేల కోట్లు ఉంటే రూ.1300 కోట్లు ఇస్తున్నామని తెలిపారని, సంక్రాంతి ముగిసి వారమైనా నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

తక్షణమే 12వ పిఆర్‌సి ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల 12వ వేతన సవరణ కమిషన్(పిఆర్‌సి)ను నియమించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్ అధ్యక్షతన విజయవాడలోని ఎస్‌టియు కార్యాలయంలో గురువారం జరిగింది. డిఎ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను చెల్లించాలని, పెరుగుతున్న ధరల నేపథ్యంలో 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేసింది. పాఠశాల విద్య బలోపేతం కోసం ప్రభుత్వం 117 జివో రద్దు కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గదర్శకాల్లో పెద్ద ప్రయోజనాలు లేవని అభిప్రాయం వ్యక్తం చేసింది. వీటిని సవరించి నాణ్యమైన విద్యాబోధన కోసం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని ఉన్నత పాఠశాలల్లో 1:30గా పరిగణించాలని కోరింది. 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ప్రారంభించాలని, ప్రాథమిక పాఠశాల(పిఎస్)ల్లో 45 మంది విద్యార్థులు దాటిన వాటిని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, 30 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పిఎస్‌లలో అదే స్థాయి కొనసాగిస్తూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. విద్యార్థులకు ప్రభుత్వం రవాణా వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఆర్థిక, ప్రయోజనాలు, పెండింగ్ డిమాండ్ల సాధన కోసం జెఎసితో కలిసి ఉద్యమించాలని తీర్మానం చేసింది. ఈ సమావేశంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి, కో ఛైర్మన్ బి మనోజ్‌కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కె భానుమూర్తి, కోశాధికారి ఎంఎస్ ఇమామ్‌బాషా, కార్యవర్గ సభ్యులు కె సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమం ఈ నెల 24న సచివాలయం మొదటి బ్లాక్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న దేశవ్యాప్తంగా ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తోందని, ఈ నెల 25న సెలవు కావడంతో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఒక రోజు ముందుగానే శుక్రవారం ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. సచివాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐసిడిఎస్ నిర్వీర్యానికి కేంద్రం యత్నం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. విజయవాడలోని ఎంబివికెలో గురువారం నిర్వహించిన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి యూనియన్ అధ్యక్షులు జి.బేబిరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ... ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే బడ్జెట్ కేటాయింపులను కేంద్రం తగ్గిస్తుందన్నారు. మాతృ, శిశు మరణాలు తగ్గించడంలో అంగన్వాడీ కార్యకర్తలు కీలకమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. సమ్మె కాలంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు అధికారంలోకి వస్తే అంగన్వాడీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు ఆ చర్యలు చేపట్టడం లేదన్నారు. కొన్ని జిల్లాలో అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడు తూ, 42 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన మినిట్స్ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకూ ప్రాజెక్టు స్థాయిలో ధర్నాలు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని, అఖిల భారత కమిటీ ఫిబ్రవరి 13వ తేదీన ఢిల్లీలో జరగనున్న సదస్సు జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చేందుకు, మట్టి ఖర్చులకు జిఒ జారీ చేయాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్‌లకు ప్రమోషన్ గైడ్‌లైన్స్ రూపొందించాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయాలని, నిలిచిన వేతనాలు, బిల్లులు మంజూరు చేయాలని కోరారు. సెక్టార్ సమావేశాల్లో... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సంతకాలు సేకరణకు పిలుపునిచ్చారు. అంతకు ముందు యూనియన్ క్యాలెండర్‌ను సిహెచ్.నర్సింగరావు ఆవిష్కరించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా పోరాటాలు చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సిహెచ్.చంద్రావతి, ఎన్‌సిహెచ్.సుప్రజ, సుధ, రాజేశ్వరి, లక్ష్మీదేవి, రమాదేవి, దుర్గారాణి, అన్నపూర్ణ, సుజాత, శ్రీదేవి, షీభ తదితరులు పాల్గొన్నారు.

'డిప్యూటీ సిఎం' డిమాండ్ పార్టీ నిబంధనల ఉల్లంఘన : పల్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉపముఖ్యమంత్రి చేయాలనే డిమాండ్ తమ పార్టీ నియమావళిని దాటి మాట్లాడుతున్నట్లుగా భావిస్తున్నామని టిడిపి రాష్ట్రఅధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి డిమాండ్ తీసుకొచ్చిన వారికి తమ పార్టీ గీత దాటొద్దని చెప్పామని తెలిపారు. ఇష్టానుసారం మాట్లాడటానికి లేదని, పార్టీ నిబంధనలు, పద్ధతి ప్రకారం జాతీయ అధ్యక్షులు పదవులు ప్రకటిస్తారని వెల్లడించారు. అనుభవం ఉన్న చంద్రబాబు, యువ నాయకత్వం లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధివైపు అడుగులు వేస్తుందన్నారు. లోకేష్ తెలివితేటలతో రెండు నెలల్లో కోటికి పైగా సభ్యత్వాలు పూర్తిచేశామని తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం నుంచి రూ.11,440 కోట్ల నిధులు తీసుకురావడంలో లోకేష్ పాత్ర కీలమని చెప్పారు.

పరిశ్రమలు తీసుకురావాలన్నదే చంద్రబాబు లక్ష్యం: వర్ల

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందే రీతిలో పరిశ్రమలు తీసుకురావాలని, వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలన్నదే చంద్రబాబు దావోస్ పర్యటన లక్ష్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

టిడిపి కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలు

టిడిపి ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు టిడిపి కార్యాలయంలో గురువారం జరిగాయి. విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎంఎ షరీఫ్‌ల సమక్షంలో కేక్ కట్ చేశారు. టిడిపి నాలెడ్జ్ సెంటర్ విభాగంలో ఏర్పాటుచేసిన కేక్‌ను ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి కట్ చేశారు. లోకేష్ జన్మదినం సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక విభాగం నాయకులు ఎస్‌కె రాజు లోకేష్‌పై రచించిన పాటను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

కామ్రేడ్ ఎంహెచ్

ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించిన మేరునగధీరుల్లో ఒకరు మోటూరు హనుమంతరావు.. ఆయనను ఎంహెచ్ అని అందరూ ఆప్యాయంగా పిలుచుకుంటారు.. విద్యార్థి దశలో రాజకీయాల వైపు ఆకర్షితులైన ఆయన ఆఖరి క్షణం వరకు అదే ధ్యాసగా, శ్వాసగా జీవించారు. పార్టీ నాయకుడుగా, సంపాదకుడుగా, రచయితగా, పార్లమెంటేరియన్‌గా ఏక కాలంలో బహుముఖ బాధ్యతలు నిర్వహించిన సవ్యసాచి. 1917 అక్టోబరులో గుంటూరు జిల్లా వెల్లటూరులో జన్మించిన ఎంహెచ్ పాఠశాల విద్యలో ఉండగానే రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. సోషలిస్టు భావాలు వంట పట్టించుకున్నారు. గుంటూరు ఎసి కాలేజీలో చదువుతూ విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. కొత్తపట్నం, మంతెనవారి పాలెం రాజకీయ పాఠశాలలు ఆయనలో మార్క్సిజం లెనినిజం బీజాలు బలంగా నాటాయి. 1937లో కమ్యూనిస్టు పార్టీలో చేరి బసవపున్నయ్య ప్రభృతులతో కలిసి చురుగ్గా పనిచేయసాగారు. ఆనాటి నుంచి అనేకసార్లు అజ్ఞాతవాసం కారాగారవాసాలతో ఆయన రాజకీయ జీవితం అగ్నిపరీక్షల మయంగా సాగింది. అయినా మొక్కవోని దీక్షతో నిలబడ్డారు. 1948లో బుద్ధవరంలో జరిగిన పార్టీ మహాసభలో రాష్ట్ర కార్యదర్శివర్గానికి ఎన్నికయ్యారు. తెలంగాణా పోరాటం సందర్భంగా కోస్తా ప్రాంతంలో అందుకు సహాయం అందిస్తున్న కమ్యూనిస్టులకై వేట సాగించిన పోలీసులు 1949లో ఆయనను అరెస్టు చేసి. కడలూరు జైలుకు పంపారు. జైలులో పోరాటాలు, కాల్పులు, మరణాలు సంభవించాయి. విడుదలై రాగానే రేపల్లె నియోజకవర్గం నుంచి రాష్ట్ర మంత్రి కల్లూరి చంద్రమౌళిని ఓడించారు.

విశాలాంధ్ర పత్రిక సంపాదకుడుగా దీర్ఘకాలంపనిచేశారు. సైద్ధాంతిక పోరాటం అనంతరం సిపిఐ(ఎం)గా ఏర్పడినప్పుడు ఆయన దానికి మొదటి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 18 ఏళ్ళు ఆ బాధ్యతలలో కొనసాగారు. మితవాద ఉగ్రవాద విచ్ఛిన్నాల నుంచి పార్టీని కాపాడ్డంలోనూ, సైద్ధాంతిక దాడులకు సమాధానాలిచ్చి శ్రేణుల అవగాహనను పరిపుష్టం చేయడంలోనూ ఆయన కలం అమోఘంగా పని చేసింది. ఆయన వ్యాసాలు, వ్యాఖ్యలు, సంపాదకీయాలు కార్యకర్తలకు కరదీపికలుగానూ, రాజకీయ ప్రత్యర్థులకు కంపరమెత్తించేవిగానూ వుండేవి. కళా సాహిత్య రంగాలలో వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించారు. మంచి ఉపన్యాసకుడు కూడా అయిన ఎంహెచ్ అక్షరాలా సవ్యసాచి అనిపించుకున్నారు. సిపిఐ(ఎం) అనేక ఆటుపోట్ల నెదుర్కొన్న దశలో సుదీర్ఘ కాలం పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఎంహెచ్ ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించడంలో నిరంతర కృషి చేశారు. క్లిష్ట సమయాలన్నిటా అగ్ర భాగాన నిలిచి కార్యకర్తల మనో ధతిని నిలబెట్టారు.

ఆయన 1962లోనూ, 1964లోనూ, జైలు శిక్షలు అనుభవించారు. ఎమర్జెన్సీలో కఠినమైన అజ్ఞాతవాసం గడుపుతూనే ఇందిరాగాంధీ నిరంకుశత్వాన్ని చీల్చి చెండాడే రచనలు చేశారు. అనువాదాలు, అనేక స్వతంత్ర రచనలు చేశారు. ప్రత్యక్ష రాజకీయాలలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తూనే రచయితగానూ ఇంత విస్తారమైన కృషి చేసిన నాయకులు చాలా అరుదు. ఆయన శాసనమండలిలో రాజ్యసభలో కూడా సభ్యులుగా వున్నారు. ఆయన కుటుంబ సభ్యులందరూ పార్టీతో వున్నారు. ముఖ్యంగా సతీమణి ఉదయం గారు తొలుత బుర్ర కథ, కళాకారిణిగా తర్వాత మహిళా నాయకురాలిగా సుపరిచితులు.

సుందరయ్య, బసవ పున్నయ్యలతో సహా సీనియర్ నాయకులందరికీ సన్నిహిత సహచరుడైన ఎంహెచ్ తర్వాతి తరాల కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ చాలా కృషి చేశారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో వుంటూ అవసరమైన సలహాలు, సహాయాలు చేస్తూ కుటుంబ పెద్దలా కనిపించేవారు. వ్యక్తిగతంగా సౌమ్యుడు, స్నేహశీలి కాగా రాజకీయ విషయాలలో ముఖ్యంగా వర్గ పోరాట అంశాలలో మాత్రం రాజీ పడటానికి నిరాకరించేవారు. గొర్బచేవ్ నాయకత్వంలో సోవియట్ దివాలాకోరు విధానాలు ప్రవేశపెట్టినప్పుడు ఆయన అత్యంత నిశితంగా ఎండగట్టారు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత కూడా సోషలిజం అజేయంగా ఉంటుందని తన రచనలతో మార్క్సిస్టు సిద్ధాంత స్ఫూర్తిని నిలబెట్టారు. గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శి బాధ్యతల నుంచి ప్రారంభమై కేంద్ర కమిటీ వివిధ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించిన ఎంహెచ్ పొలిట్‌బ్యూరో వరకు ఎదిగారు. దీర్ఘకాలం అనారోగ్యం అనంతరం 2001 జూన్ 18న కన్నుమూశారు.

ఉద్యమాలకు ప్రతీకగా 4 జాతాలు

- నెల్లూరులో 3 రోజులు సాంస్కృతిక ఉత్సవాలు
- సిపిఎం రాష్ట్ర మహాసభ ఉద్యమ గీతాల సిడి ఆవిష్కరణలో వి శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర మహాసభ పాటల సిడిని ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో సాగుతున్న ఉద్యమాలకు ప్రతీకగా రాష్ట్ర నలుమూలల నుండి నాలుగు ప్రచార జాతాలు నిర్వహిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు నగరంలో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజానాట్యమండలి రూపొందించిన పాటల సిడిని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. నెల్లూరులో జరగనున్న రాష్ట్ర మహాసభ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి నాలుగు జాతాలు ప్రారంభమై ఈ నెల 31 నాటికి నెల్లూరు చేరుకుంటాయన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ప్రతిబింబిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణే ధ్యేయంగా, విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం ప్రాణాలు త్యాగం చేసిన 32 మంది అమరవీరుల స్మారకంగా విశాఖ నుంచి ఒక జాతా ప్రారంభం అవుతుందని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నుంచి మరో జాతా బయలుదేరనుందని చెప్పారు. విద్యుత్ రంగ సంస్కరణలను వ్యతిరేకిస్తూ, అదాని, సెకీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ నంద్యాల నుంచి మూడవ జాతా ప్రారంభం కానుందని తెలిపారు. వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కడప నుంచి 4వ జాతా బయలుదేరనుందని వివరించారు. ఈ నాలుగు జాతాలూ వాటి పర్యటన ప్రాంతాల్లో ప్రచారం చేసి ఈ నెల 31వ తేదీ రాత్రికి నెల్లూరు నగరానికి చేరుకుంటాయన్నారు. నగర ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని కోరారు. ప్రజా నాట్యమండలి నిర్వహించిన పాటల సిడిలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ మహాసభల విశిష్టతను వివరిస్తామని చెప్పారు. కమ్యూనిస్టు భావాల ప్రచారానికి కళారూపాలు, కళాకారుల కృషి ఎంతైనా ఉందన్నారు.

సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభనున్న తమ్మారెడ్డి భరద్వాజ

రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరు నగరంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడ్రోజులపాటు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు వి.శ్రీనివాసరావు తెలిపారు. 27న సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారని, చివర రోజు ప్రముఖ వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ మూడు రోజుల సాంస్కృతికోత్సవాల కార్యక్రమాల్లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొంటారని చెప్పారు.

3న బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా బృందా కరత్

మహాసభ చివరి రోజైన 3న నెల్లూరు నగరంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపి బృందా కరత్ ముఖ్యఅతిథిగా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ బేబి హాజరవుతారని శ్రీనివాస రావు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు మూడ్రోజులు సభల్లో పాల్గొంటారన్నారు. ఇప్పటి వరకు జరిగిన ఉద్యమాలపై సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సాంస్కృతిక సబ్‌కమిటీ జిల్లా కన్వీనర్ మంగళ పుల్లయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, షేక్ రెహనా బేగం, పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ప్రచారం

రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు ట్రయల్ రన్

నెల్లూరు నగరంలో రెడ్‌షర్ట్ వలంటీర్ల ట్రయల్ రన్ కవాతు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

సిపిఎం రాష్ట్ర 27వ మహాసభకు సింహపురి సిద్ధమవుతోంది. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో సీతారాం ఏచూరి (అనిల్ గార్డెన్) నగర్‌లో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేసేందుకు ఊరు, వాడ కదులుతోంది. వాల్‌పోస్టర్లు, ప్రచార జాతాలు, పాటల సిడిలతో మహాసభ ప్రచారం ఊపందుకుంది. మహాసభకు సన్నాహకంగా వ్యవసాయ కార్మికులు, ట్రాన్స్‌పోర్టు కార్మికులు, మహిళలు, మైనార్టీల జిల్లా సదస్సులు జరిగాయి. రవాణా రంగంలో వస్తున్న మార్పులు, కార్మికుల ప్రభావం' అనే అంశంపై ఈ నెల 21న స్థానిక జెఎస్ ట్రస్ట్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ వ్యవసాయ కార్మికుల సమస్యలపై టిపి గూడూరు మండలం నరుకూరు సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. కార్మికవర్గ కర్తవ్యాలపై డాక్టర్ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సుకు సిఐటియు కేంద్ర కమిటీ సభ్యులు నరేంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళా సమస్యలపై సదస్సు జరిగింది. దీనికి ఐద్వా నాయకులు డి.రమాదేవి హాజరయ్యారు. వాల్‌పోస్టర్లు, గోడ రాతలు సిద్ధమయ్యాయి. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాతా విస్తృతంగా పర్యటిస్తోంది. మహాసభ విశిష్టతను ప్రజలకు వివరిస్తోంది.

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య నేతృత్వంలో 1978లో సిపిఎం రాష్ట్ర మహాసభ నెల్లూరులో నిర్వహించారు. సుమారు 47 సంవత్సరాల తర్వాత మళ్లీ రాష్ట్ర మహాసభకు నెల్లూరు మళ్లీ ఆతిథ్యమిస్తోంది. మహాసభ జయప్రదానికి నెల్లూరు జిల్లా ప్రజలు ఐచ్ఛికంగా విరాళాలు అందిస్తున్నారు. పది రూపాయల నుంచి ఎంత అవకాశం ఉంటే అంత ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నగరంలోని జనార్థన్‌రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో గోడ రాతలు రాస్తున్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మూడ్రోజులపాటు జరిగే సాంస్కృతిక ఉత్సవాల్లో ప్రదర్శించేందుకు కళారూపాలను సిద్ధం చేస్తున్నారు.. గురువారం జిల్లా వ్యాపితంగా పార్టీ పతాకాలు ఎగురవేశారు. మహాసభ ముగింపు సందర్భంగా నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుంచి నిర్వహించే ర్యాలీకి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ ర్యాలీలో రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణ కానుంది. గురువారం నెల్లూరు రూరల్ పార్టీ అధ్వర్యంలో కవాతు ట్రయల్ నిర్వహించారు. ఎర్ర చొక్కా, నెత్తిన టోపి, ఖాకీ ఫ్యాంట్, మహిళలు ఎర్ర చీరలతో కవాతులో పాల్గొననున్నారు. మహాసభకు రాష్ట్ర నలుమూల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పి.మధు మహాసభ ఏర్పాట్లను పరిశీలించారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దశల వారీ పోరు

- వామపక్ష, పోరాట కమిటీ నాయకులు

నిరసన దీక్ష నిర్వహిస్తున్న వామపక్ష, పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దశల వారీ పోరాటాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని సిపిఎం, న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.గోవిందరావు, తాండ్ర ప్రకాష్, మద్దిల రామారావు హెచ్చరించారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ, వామపక్షాలు సంయుక్తంగా కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టాయి. పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించిన దీక్షా శిబిరం వద్ద వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ సంస్థల ఆస్తులుగా మార్చడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో శ్రీకాకుళం జిల్లాలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని 20 గ్రామాల్లో 1400 ఎకరాల భూమిని ప్రజల నుంచి బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నా యన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార ఆధునీకరణకు రూ.1500 కోట్లు కేటాయించాలని, శివారు భూముల వరకు రెండు పంటలకు నీరందించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తే ఏటా రూ.వెయ్యి కోట్ల ఆదాయం సమకూరుతుందని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షలో సిపిఎం నాయకులు బి.కృష్ణమూర్తి, పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, జోగి అప్పారావు, చిత్త గున్నయ్య, మర్ల సంతోష్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జి.సింహాచలం, టి.అజయ్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉబర్, ఓలా అడ్డగోలు దోపిడి

- ఫోన్ ధరను బట్టి ఛార్జీలు
- ఇరు సంస్థలకు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ : హెచ్చు కమిషన్లతో డ్రైవర్ల పొట్టకొడుతూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఉబర్, ఓలా కంపెనీలు ప్రయాణికులను దోచేస్తున్నాయి. క్యాబ్ సేవలందించే ఈ సంస్థలు వినియోగదారుల ఫోన్ల ధరలను బట్టి చార్జీలను పెంచి వసూలు చేస్తున్నాయి. దీనిపై ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకే దూరం, గమ్యస్థానానికి వివిధ రకాల చార్జీలను వసూలు చేయడంపై ఇటీవల భారీగా ఫిర్యాదులు అందాయి. ఈ అడ్డగోలు చార్జీలపై ఓలా, ఉబర్ కంపెనీలకు గురువారం కేంద్రం నోటీసులు జారీ చేసింది.

ఆండ్రాయిడ్, ఐఓఎస్ మాత్రమే కాకుండా స్మార్ట్‌ఫోన్ ఖరీదును బట్టి కూడా ఛార్జీల్లో తేడా ఉంటుందని ఫిర్యాదులు అందాయి. క్యాబ్ సర్వీసులను బుక్ చేసుకునేందుకు ఉపయోగించే మొబైల్ మోడల్‌ని బట్టి రైడింగ్ ఛార్జీలను విధించడంపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకే దూరానికి ఇరు కంపెనీలు వేర్వేరు మొత్తాల్లో ఛార్జీలు విధిస్తున్నట్టు కూడా ఫిర్యాదులు వచ్చాయని వినియోగదారుల మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) సైతం చర్యలకు ఉపక్రమించింది. ఒకే రకమైన సర్వీసుకు రెండు రకాల ధరలను ఎలా నిర్ణయించారనే దానిపై వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఛార్జీల్లో పారదర్శకత తీసుకునేందుకు సమగ్రమైన వివరణతో కూడిన రిపోర్ట్ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేసింది.

రైడ్ బుకింగ్ సమయంలో ఒక ధర.. గమ్యస్థానానికి చేరాక మరో ధరను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉబర్ కంపెనీ ఫోన్ మోడల్‌ని బట్టి కాకుండా అందులోని బ్యాటరీ పర్సంటేజీ ఆధారంగా కూడా ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటుందని ఇటీవల ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేశారు. పలు ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్‌ల ద్వారా పరిశీలించిన తర్వాత కూడా దీన్ని నిర్ధారించినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి దోపిడిని ప్రభుత్వం ఏమాత్రం సహించదని వినినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లద్ జోషి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని సిసిపిఎను ఆదేశించామన్నారు.

నడకమార్గంలో సర్వదర్శనం టోకెన్లు పున:ప్రారంభం

శ్రీవారి మెట్టు మార్గంలో టికెట్ల కోసం క్యూలైన్లలో ఉన్న సందర్శకులు

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి తిరుమలకు మెట్ల మార్గంలో నడిచి వెళ్లే సందర్శకులకు గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) సర్వదర్శనం టోకెన్లు జారీ చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా టిటిడి గత 14 రోజులుగా టోకెన్ల జారీ నిలిపివేసింది. వైకుంఠ ఏకాదశి ఘట్టం ముగియడంతో నడిచి వెళ్లే సందర్శకులకు శ్రీవారి మెట్టు వద్ద దర్శనం టోకెన్ల జారీని గురువారం పునఃప్రారంభించింది. ఈ టోకెన్లను మార్గమధ్యంలో విజిలెన్స్ విభాగం సిబ్బంది పరిశీలించి టిటిడి స్టాంప్ వేస్తారు. ఈ స్టాంపు వేసిన టోకెన్లు కలిగిన సందర్శకులను మాత్రమే శ్రీవారి దర్శనానికి క్యూకాంప్లెక్స్ వద్ద అనుమతించారు. రోజుకు ఐదు వేల టోకెన్లను జారీ చేయనున్నట్లు టిటిడి పేర్కొంది. సందర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి-అగళి (సత్యసాయి జిల్లా)

ట్రాన్స్‌ఫార్మర్ మీద మరణించిన శివకుమార్

ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మరణించిన ఘటన శ్రీ సత్యసాయి జిల్లా అగళి మండలం దొక్కలపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... రాయనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా శివకుమార్ (48) విధులు నిర్వహిస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని దొక్కలపల్లి ఫీడర్‌లో విద్యుత్ సమస్య రావడంతో ఫీజు వేసేందుకు ట్రాన్‌ఫార్మర్ వద్దకు వెళ్లారు. మరమ్మతు చేసే సమయంలో ఎల్‌సి తీయమని సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పారు. విద్యుత్ ప్రసరణ ఆగిందన్న ఉద్దేశంతో మరమ్మతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కారు. విద్యుత్ తీగను పట్టుకోగానే షాక్‌కు గురై శివకుమార్ అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న విద్యుత్ ఎడి, ఎఇ ఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎడి భూపతి తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌పైన ఉన్న మృతదేహాన్ని కిందకు దింపారు. శివకుమార్ భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.4.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

- ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్టు

ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చిత్తూరు జిల్లా గుడిపాల మండల పరిధిలోని చిత్తూరు - వేలూరు మార్గం పానాటూర్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేపట్టిన వాహన తనిఖీల్లో ఏడు టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రచందనం దుంగలు, అంతరాష్ట్ర స్మగ్లర్ల వివరాలను టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పి శ్రీనివాస్‌తో కలిసి మీడియాకు వివరించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. వాహనాల తనిఖీని గమనించిన స్మగ్లర్లు తమ కంటైనర్‌ను రహదారిపై ఆపి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు చుట్టుముట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌లోని ఏడు టన్నుల (413) ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 4.5 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లను విచారించగా తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాలోని గోదాము నుంచి ఈ ఎర్రచందనం దుంగలను అస్సాం రాష్ట్రానికి తరలిస్తున్నట్లు వెల్లడైందన్నారు. స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన నరేంద్ర కుమార్, అస్సాంకు చెందిన బినోయ్ కుమార్, రాజస్థాన్‌కు చెందిన విజయ్ జ్యోషిగా గుర్తించామని, దీని వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 విడుదల

బెంగళూరు : సామ్‌సంగ్ తన గెలాక్సీ సిరీస్‌లో ఎస్25ని మార్కెట్లోకి విడుదల చేసింది. ఇందులో గెలాక్సీ ఎస్25, ఎస్25 ప్లస్, ఎస్25 అల్ట్రా వేరియంట్లను ఆవిష్కరించింది. ఎఐ పవర్, 12జిబి ర్యామ్, వివిధ మెమెరీలతో వస్తోన్న వీటి ధరల శ్రేణి రూ.80,999 నుంచి రూ.1,65,000గా నిర్ణయించింది. జనవరి 23 నుంచి ప్రీ ఆర్డర్‌లో రూ.21,000 రాయితీలను కల్పిస్తోన్నట్లు ఆ కంపెనీ తెలిపింది. 50 ఎంపి ప్రైమరీ కెమెరా, 12 ఎంపి అల్ట్రావైడ్ కెమెరా, 10 ఎంపి టెలిఫొటో కెమెరాలు ఉంటాయి. సెల్ఫీల కోసం 12 ఎంపి కెమెరా ఉంటుంది. ఏడేళ్ల వరకూ సెక్యూరిటీ అప్‌డేట్‌లు ఇచ్చింది.

మారుతి సుజుకి కార్లు ప్రియం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి కారు మోడల్ ఆధారంగా అత్యధికంగా రూ.32,500 వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో వాహన ధరలు పెంచాల్సి వస్తుందని తెలిపింది. ఈ భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఆల్టో కె10 నుంచి ఇన్విక్టో వరకు రూ.3.99 లక్షల నుంచి రూ.28.92 లక్షల ధరల శ్రేణీలో పలు మోడళ్లను విక్రయిస్తోంది.

ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్‌లో 76 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌నకు చెందిన ప్రముఖ బి 2 బి ఓమ్నిచానెల్ ప్లాట్ఫామ్ ఫ్లిప్‌కార్ట్ హోల్ సేల్ ప్రత్యేకంగా 'రిపబ్లిక్ డే సేల్'ను ప్రకటించింది. కిరాణా వ్యాపారులకు లాభదాయకతను పెంచడానికి రూపొందించిన ఇది జనవరి 26 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది. సాధారణ సరుకులు, స్టేపుల్స్, వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ, ఆహారం, పానీయాలు ఇంకా మరెన్నో విస్తృత శ్రేణి ఉత్పత్తులపై 76 శాతం వరకు డిస్కౌంట్ ఉంటుందని తెలిపింది.

సైయంట్‌కు రూ.122 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఐటి కంపెనీ సైయంట్ 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 31.7 శాతం తగ్గుదలతో రూ.122.3 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం త్రైమాసికంలో రూ.179 కోట్ల లాభాలు సాధించింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 4.2 శాతం పెరిగి రూ.1,926.4 కోట్లుగా నమోదయ్యింది. ఇది సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.1,849 కోట్లుగా ఉంది.

ఎల్ఐసి ఎంఎఫ్ నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్

న్యూఢిల్లీ : ఎల్‌ఐసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎల్‌ఐసి ఎంఎఫ్ మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను విడుదల చేసింది. ఈ ఓపెన్ ఎండెడ్ స్కీమ్‌లోని నిధులను ఈక్విటీ, డెట్, పసిడి విభాగాల్లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది.

ఈ ఎన్ఎఫ్ఒ జనవరి 24న తెరుబడుతుందని.. ఫిబ్రవరి 7న మూసివేసి.. తిరిగి ఫిబ్రవరి 18న తెరువనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5000గా నిర్ణయించింది. సిప్‌ల్లో అయితే కనీస పెట్టుబడి రూ.200 నుంచి ప్రారంభం అవుతుందని తెలిపింది.

తగ్గిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లాభాలు

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఎస్ఎఫ్‌బి) 64 శాతం తగ్గుదలతో రూ.109 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. అధిక మొండి బాకీలు లాభాల తగ్గుదలకు ప్రధాన కారణమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.300 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.1,655 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ3లో రూ.1,763 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.68 శాతానికి పెరగాయి. 2023 డిసెంబర్ త్రైమాసికంలో 2.18 శాతంగా జిఎన్‌పిఎ నమోదయ్యింది. నికర నిరర్థక ఆస్తులు 0.17 శాతం నుంచి 0.56 శాతానికి పెరిగాయి.

ఎల్‌జి గణతంత్ర దినోత్సవ ఆఫర్లు

న్యూఢిల్లీ : ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ 'ది నేషన్ కాల్స్ ఫర్ సెలబ్రేషన్' పేరుతో ప్రత్యేక గణతంత్ర దినోత్సవ ఆఫర్లను అందిస్తున్నట్లు తెలిపింది. అర్హులైన వారు రూ.26 చెల్లించి.. మిగితా మొత్తాన్ని వాయిదాల్లో చెల్లించవచ్చని పేర్కొంది. పలు మోడళ్లపై 32.5 శాతం వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చని పేర్కొంది. పలు ఉచిత బహుమతులు అందుకోవచ్చని తెలిపింది. ఈ ఆఫర్ జనవరి 31 వరకు తమ స్టోర్లు, ఎల్‌జి ఆన్‌లైన్ వేదికలో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది.

సంపాదకీయం

రాష్ట్రహోదా ఎప్పుడు?

జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామంటూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పటం మరొక దాటవేత ధోరణి. శ్రీనగర్ వెళ్లి జెడ్ సొరంగ మార్గాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞాపనను విలేకరులు ప్రస్తావించగా, మోడీ చేసిన ఈ వ్యాఖ్యలో చిత్తశుద్ధి కనపడలేదు. ఆ తగిన సమయం ఏమిటో, ఎప్పుడు వస్తుందో అన్నది పెద్ద ప్రశ్నార్థకం. 'మోడీ మాట ఇచ్చాడంటే తప్పడు' అంటూ ఆ సమయంలో తనకు తాను కితాబు ఇచ్చుకున్న ప్రధాని – గతంలో మాట ఇచ్చి తప్పిన వైనాలెన్నో! విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కు తీసుకొచ్చి, ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఆ మాటను గంగలో కలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని వెంకన్న సాక్షిగా వాగ్దానం చేసి, కొన్నాళ్లకే తుంగలో తొక్కారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ విషయంలోనూ ఇదే నాటకం ఆడుతున్నారు.

2019 ఆగస్టు మొదటివారంలో పెద్దఎత్తున సైన్యాన్ని మోహరించి, సమాచార సాంకేతిక వ్యవస్థను స్తంభింపజేసి, జమ్మూకాశ్మీర్ రాష్ట్రహోదాను, రాజ్యాంగంలోని 370, 35 (ఎ) అధికరణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష చర్య ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. కాశ్మీరీ ప్రజలు మొత్తాన్ని గంపగుత్తగా ఉగ్రవాదులన్నట్టుగా చిత్రీకరిస్తూ, నెలల తరబడి తీవ్ర నిర్బంధం విధించిన వైనం సమీప భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరగనిది. బయటికి చెప్పకున్నా మత ప్రాతిపదికన రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి, తమ రాజకీయ బలాన్ని పెంచుకోవటానికి కాషాయశక్తులు చేసిన నిర్వాకం ప్రపంచ విదితమే! చారిత్రిక నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కులను తుత్తునియలు చేసి, కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలకు నిలువునా పాతరేసిన మోడీ ప్రభుత్వం .. అక్కడ వివిధ పార్టీల నాయకుల పైనా, ప్రజలపైనా నిరంకుశంగా వ్యవహరించింది. ప్రజల భూముల పరిరక్షణకు ఉన్న ప్రత్యేక చట్టాలనూ రద్దు చేసింది. కార్పొరేట్లు, ఇతర సంపన్నులూ కాశ్మీర్ భూభాగంలో సులభంగా పాగా వేసేందుకు వీలు కల్పించింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ఆఖరికి సుప్రీం కోర్టు ఆదేశంతో గతేడాది సెప్టెంబర్లో శాసనసభకు ఎన్నికలు జరిపారు. ఆ ఎన్నికల్లో గెలవాలని బిజెపి ఎన్ని పన్నాగాలు పన్నినా ... నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్ కూటమికి ప్రజలు పట్టం కట్టారు. లోక్‌సభ ఎన్నికల కన్నా ఐదు శాతం ఎక్కువ పోలింగుతో తమ ఆకాంక్షను, బిజెపి వ్యతిరేకతనూ బలంగా వ్యక్తం చేశారు. ఎన్నికలు జరిగి నాలుగు నెలలు గడచిపోయినా, మోడీ ప్రభుత్వం ప్రజాతీర్పు పట్ల పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తోంది.

జమ్మూకాశ్మీర్ ప్రత్యేక రక్షణ చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం – టీ 33 సొరంగమార్గంలో రైల్వేలైను వేయటాన్ని గొప్పగా చెప్పుకుంటోంది. ఇకపై దేశంలోని అన్ని ప్రాంతాల నుంచీ ఢిల్లీ మీదుగా కాశ్మీర్‌కు నేరుగా ప్రయాణం సాగించవొచ్చని చెబుతోంది. ఈ రైల్వేలైనుపై జనవరి 26న వందేభారత్ రైలు తొలి ప్రయాణం చేయటానికి సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు, రైలు రవాణా సదుపాయాలను మెరుగుపర్చటం అభ్యంతరకరం కాదు గానీ, ప్రజల న్యాయబద్ధమైన హక్కులను పునరుద్ధరించకుండా రాష్ట్రాన్ని ఉద్ధరిస్తున్నట్టు ఉపన్యాసాలు దంచటం కచ్చితంగా అసమంజసం.

జమ్మూకాశ్మీర్‌లో ప్రజలను అనుమానించే, వేధించే చర్యలు ఇప్పటికీ ముమ్మరంగా సాగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ స్వయంగా చెబుతున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన రాష్ట్రంలో ముఖ్యమంత్రికి, శాసనసభకూ ఉన్న అధికారాలు, అవకాశాలూ పరిమితం. పోలీసులను నియంత్రించే, నిర్దేశించే కనీస అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. ఈ నేపథ్యంలో అక్కడి బిజెపి మినహా అన్ని రాజకీయ పక్షాలూ శాసనసభలో చేసిన రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలి. కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక, సామాజిక గుర్తింపులను పట్టించుకోవాలి. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నప్పటికీ లెఫ్టినెంట్ గవర్నరు రూపంలో సాగుతున్న కేంద్ర ప్రభుత్వ పెత్తనానికి తక్షణం స్వస్తి చెప్పాలి. పొరుగు దేశాలతో సరిహద్దులు కలిగి ఉన్న సున్నితమైన ప్రాంతంలో రాజకీయ క్రీడలు ప్రమాదకరం. కాబట్టి, వెంటనే జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను పునరుద్ధరించటం ప్రజాస్వామికం.

మహనీయుల మాట



స్త్రీ పురుషుడిపై ఆధార పడాల్సి వస్తోంది. తల్లిదండ్రులు పిల్లలపై ఆధార పడాల్సి వస్తోంది. ఈ పరాధీనతకు మూలం సొంత ఆస్తే. కమ్యూనిస్టు సమాజం సొంత ఆస్తిని రద్దు చేస్తుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,
కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక.

రాజ్యాంగ చిక్కులకు దారితీస్తున్న యు.జి.సి నిబంధనలు

విశ్లేషణ

విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేసే విధానానికి సవరణలు చేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) రూపొందించిన నిబంధనల ముసాయిదాకు భారతీయ జనతా పార్టీ యేతర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. కొత్తగా రూపొందించిన ఈ విధివిధానాలు రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నాయనేది వాటి ప్రధాన విమర్శ. అందుకే ఈ నిబంధనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

వైస్ ఛాన్సలర్ ఎంపిక, నియామకాలకు సంబంధించి 2010 నాటి నిబంధనలకు యు.జి.సి సవరణలు ప్రతిపాదించింది. 2010 నాటి నిబంధనల ప్రకారం కనీసం పదేళ్లపాటు ప్రొఫెసర్‌గా పని చేసిన అనుభవంగల విద్యావేత్తలు ఈ పదవికి అర్హులు. తాజా సవరణ ద్వారా విద్యావేత్తలే కాకుండా పారిశ్రామిక రంగం, ప్రభుత్వ యంత్రాంగం, పబ్లిక్ పాలసీ రంగాలలో పదేళ్లకు పైగా అనుభవం ఉన్న వారినైనా వైస్ ఛాన్సలర్‌గా నియమించవచ్చని ప్రతిపాదించింది.



పి.డి.టి.ఆచారి

ఈ ప్రతిపాదనలు రాజ్యాంగపరమైన అనేక చిక్కులు తెచ్చి పెడుతుంది. ప్రస్తుతం ఈ అంశం మీద రాజకీయంగా చెలరేగిన నిరసనలు, బహుశా ఈ నిరసనలకు వ్యతిరేకంగా యు.జి.సి గానీ అధికార పార్టీ గానీ రాజకీయంగా ఎలా స్పందిస్తాయన్న విషయాలను పక్కనపెట్టి ఈ సమస్య లోతుపాతులు చర్చించేందుకు ప్రయత్నిద్దాం.

యు.జి.సి చట్టం లక్ష్యం

పార్లమెంట్ 1956లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చట్టం చేసింది. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలను నిర్ధారించడానికి, సమన్వయ పరచడానికి యు.జి.సిని నెలకొల్పుతున్నామని పార్లమెంటు ప్రకటించింది. అంతేగాక విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, పరిశోధనల ప్రమాణాలను నిర్ధారించడానికి, మెరుగుపరచడానికి యు.జి.సి కృషి చెయ్యాలని చట్టం స్పష్టం చేస్తున్నది. ఈ కర్తవ్యాల నిర్వహణ కోసం, విశ్వవిద్యాలయాల నిర్వహణ, అభివృద్ధి కోసం యు.జి.సి నిధులు కేటాయించాలి. విశ్వవిద్యాలయాలు అందించే విద్యలో మెరుగుదల కోసం తీసుకోవాల్సిన చర్యలు సిఫార్సు చెయ్యవచ్చు. విశ్వవిద్యాలయాల సాధారణ, ప్రత్యేక అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గ్రాంట్లు ఇవ్వమని సలహా ఇవ్వవచ్చు. విద్యకు సంబంధించి దేశంలోని విశ్వవిద్యాలయాలన్నింటి నుంచీ, విదేశీ విశ్వవిద్యాలయాల్లో విద్యాబోధన గురించి సమాచారం సేకరించి, ఆ సమాచారం మొత్తాన్ని ప్రతి విశ్వవిద్యాలయానికి అందుబాటులో ఉంచవచ్చు. ఫీజుల నియంత్రణను పర్యవేక్షించవచ్చు.

యు.జి.సి చట్టం సెక్షన్ 26 ప్రకారం ఈ చట్టాన్ని తు.చ తప్పక పాటించాలి. అమలు చెయ్యాలని యు.జి.సి నిబంధనలు రూపొందించవచ్చు. అయితే యు.జి.సి రూపొందించే నిబంధనలు యు.జి.సి చట్టానికి, అందులోని నియమాలకు లోబడి ఉండాలని చట్టం స్పష్టంగా చెబుతుంది. ఈ చట్టంలో అన్నిటికన్నా ముఖ్యమైన నిబంధన ఏమిటంటే విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందిగా నియమించబడడానికి కావాల్సిన అర్హతలు, విశ్వవిద్యాలయం జారీ చేసే డిగ్రీలకు ఉండే ప్రమాణాలు, ఆ ప్రమాణాలు నిలబెట్టడానికి విశ్వవిద్యాలయాలతో సమన్వయం చేసుకుని జరగాల్సిన కృషికి సంబంధించినది.

తనకు మాలిన ధర్మం...

ప్రస్తుతం విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవులకు అర్హతలు సవరిస్తూ కొత్త ప్రతిపాదనలు తీసుకువచ్చే అధికారం చట్ట ప్రకారం యు.జి.సికి ఉన్నదా అనేదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. వాస్తవానికి చట్టంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ల ఎంపిక నియామకాలలో యు.జి.సికి ఎలాంటి అధికారాలూ లేవు. చట్టం ప్రకారం యు.జి.సి మౌలిక లక్ష్యం విశ్వవిద్యాలయాల ప్రమాణాలు నిర్ధారించడం, పెంపొందించడం, సమన్వయం చేయడం వరకే పరిమితం. బోధనా ప్రమాణాలు నిర్ణయించడం, బోధనా సిబ్బందికి ఉండాల్సిన అర్హతలకు సంబంధించి ఆదేశాలు కూడా యు.జి.సి ఇవ్వవచ్చు. కానీ చట్టంలో ఎక్కడా పేర్కొనని వైస్ ఛాన్సలర్ల నియామకాలలో జోక్యం చేసుకోవడం తనకు మాలిన ధర్మమే. యు.జి.సి రూపొందించే నియమ నిబంధనలు యు.జి.సి చట్టానికి లోబడే ఉండాలి తప్ప చట్టాన్ని అతిక్రమించే హక్కు ఆ సంస్థకు లేదు. కాబట్టి వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి యు.జి.సి తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలు చట్ట రీత్యా చెల్లుబాటు కావు.

> **వాస్తవానికి చట్టంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ల ఎంపిక నియామకాలలో యు.జి.సికి ఎలాంటి అధికారాలూ లేవు. చట్టం ప్రకారం యు.జి.సి మౌలిక లక్ష్యం విశ్వవిద్యాలయాల ప్రమాణాలు నిర్ధారించడం, పెంపొందించడం, సమన్వయం చేయడం వరకే పరిమితం. బోధనా ప్రమాణాలు నిర్ణయించడం, బోధనా సిబ్బందికి ఉండాల్సిన అర్హతలకు సంబంధించి ఆదేశాలు కూడా యు.జి.సి ఇవ్వవచ్చు. కానీ చట్టంలో ఎక్కడా పేర్కొనని వైస్ ఛాన్సలర్ల నియామకాలలో జోక్యం చేసుకోవడం తనకు మాలిన ధర్మమే. యు.జి.సి రూపొందించే నియమ నిబంధనలు యు.జి.సి చట్టానికి లోబడే ఉండాలి తప్ప చట్టాన్ని అతిక్రమించే హక్కు ఆ సంస్థకు లేదు. కాబట్టి వైస్ ఛాన్సలర్ల నియామకానికి సంబంధించి యు.జి.సి తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనలు చట్ట రీత్యా చెల్లుబాటు కావు.**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చేసిన శాసనాల ద్వారా విశ్వవిద్యాలయాలను నెలకొల్పాయి. కాబట్టి ఆ యా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకాలకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు వంటివి సదరు ప్రభుత్వాలు శాసన రూపేణా నిర్ణయించాలే తప్ప ఆ పని యు.జి.సి చేపట్టరాదు. వైస్ ఛాన్సలర్ల నియామక ప్రక్రియ యు.జి.సి భావిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ప్రమాణాలను సమన్వయం చేయడం, పెంపొందించడం వంటి అంశాల పరిధిలోకి రాదు.

సురేష్ పాటిల్ ఖేడ్ వర్సెస్ ద ఛాన్సలర్ యూనివర్సిటీస్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ అదర్స్ కేసులో (2011) ముంబై హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ అంశాన్నే నిర్ధారిస్తుంది. కోర్టువారి దృష్టిలో విశ్వవిద్యాలయాల ప్రొ ఛాన్సలర్‌లు, వైస్ ఛాన్సలర్ల నియామక పద్ధతులు గానీ, అర్హతలు గానీ విశ్వవిద్యాలయాల ప్రమాణాల మీద ప్రత్యక్షంగా ప్రభావం చూపిస్తాయని భావించడానికి వీలులేదని ఆ తీర్పు స్పష్టం చేస్తుంది. కాబట్టి యు.జి.సి చట్టంలోని సెక్షన్ 26 కింద విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల ఎంపిక, నియామకాలు యు.జి.సి పరిధిలో లేవని తేటతెల్లం అవుతుంది.

విశ్వవిద్యాలయాల స్థాపన కోసం కేంద్రం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన శాసనాలను త్రోసిరాజనే అధికారం యు.జి.సికి ఉందా అనేది రాజ్యాంగ పరమైన సవాలు. గతంలో కొన్ని విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల అర్ధాంతర తొలగింపు సందర్భంగా ఈ ప్రశ్న తలెత్తింది. సురేష్ పాటిల్ ఖేడ్ కేసులో బొంబాయి హైకోర్టు ఇంకా ఇలా పేర్కొంది. యు.జి.సి రెగ్యులేషన్స్ 2010లో రెగ్యులేషన్ 7.3.0ను అనుసరించి...యు.జి.సి పార్లమెంట్ చేసిన చట్టాన్ని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలను అతిక్రమించజాలదు. అయితే సుప్రీం కోర్టు కల్యాణి మతివనన్ వర్సెస్ కె. విజయరాజ్ అండ్ అదర్స్ కేసులో (ఆలిండియా రిపోర్ట్ 2015 సుప్రీంకోర్టు 1875 పేరా 22) చట్టం ద్వారా రూపొందించిన యుజిసి నిబంధనలు ఏ విశ్వవిద్యాలయాలకు చెందుతాయో వాటికి వర్తిస్తాయి' అని వేర్కొన్నది. పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదిస్తే ఆ నిబంధనలు వర్తింప చేయవచ్చు' అంటూ తన తీర్పుకు గల ప్రాతిపదికన వివరించింది. అయితే ప్రస్తుతం యుజిసి చేసిన సవరణ ప్రతిపాదనలను పార్లమెంటు ఆమోదించినవి కావు. పార్లమెంట్ ఆమోదించిన తర్వాతే సవరణ ప్రతిపాదనలు అమల్లోకి వస్తాయి. అప్పటి వరకూ అవి ప్రతిపాదనలుగానే ఉంటాయి. అయితే కల్యాణి మతివనన్ కేసులో సుప్రీంకోర్టు గౌరవ న్యాయమూర్తులు చట్ట సభలలో నియమ నిబంధనలను ప్రవేశపెట్టి ఆమోదించే సంవిధానాన్ని పరిగణనలోకి తీసుకోలేదని చెప్పక తప్పడం లేదు.

యుజిసి నిబంధనలు రాష్ట్రాలు చేసే చట్టాలను త్రోసిరాజనే అవకాశం ఉన్నదా లేదా అనేది రాజ్యాంగంలోని 254వ అధికరణం కింద పరిశీలించాలి. ఈ అధికరణాన్ని అనుసరించి ఏ రాష్ట్ర ప్రభుత్వ చట్టమైనా కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా వుంటే అలా ఉన్న భాగం చెల్లుబాటు కాదు. అయితే ప్రస్తుతం యుజిసి తీసుకువచ్చిన సవరణ ప్రతిపాదనలు 254వ అధికరణం కింద కేంద్ర చట్టం పరిధిలోకి వస్తాయా అనేది కీలకమైన ప్రశ్న. ఈ అధికరణంలోని రెండవ క్లాజ్‌ను అనుసరించి ఏ రాష్ట్ర శాసనసభ అయినా చట్టం చేసి రాష్ట్రపతి ఆమోద ముద్ర కోసం పంపితే రాష్ట్రపతి ఆమోదం లభించిన తరువాతనే ఆ చట్టం అమల్లోకి వస్తుంది. ఈ క్లాజులో చట్టం అనే మాటకు అర్థం శాసనసభ ఆమోదించిన బిల్లు అని మాత్రమే. ఆ బిల్లు మీద రాష్ట్రపతి ఆమోద ముద్ర పడ్డాకే అది చట్టంగా చలామణిలోకి వస్తుంది. రాష్ట్రపతి ఆమోదం లభించిన తర్వాత బిల్లుకు చేసే సవరణలు చట్టరీత్యా చెల్లుబాటు కావు. రాష్ట్రాలు చేసిన చట్టాలను అధిగమించాలంటే పార్లమెంట్ ఉభయ సభలు ఆ మేరకు బిల్లు ఆమోదించి, దాన్ని రాష్ట్రపతి ఆమోదానికి పంపాలి. రాష్ట్రపతి ఆమోద ముద్ర పడిన తర్వాత మాత్రమే రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం చెల్లుబాటు కాకుండా పోతుంది.

కీలకమైన రూలింగ్

ఏమైనప్పటికీ కల్యాణి మతివనన్ కేసులో కోర్టు కీలకమైన రూలింగ్ ఇచ్చింది. యుజిసి చట్టం లోని 7.3.0 నిబంధన ప్రకారం రాష్ట్రాల శాసన సభల ద్వారా నెలకొల్పబడిన కాలేజీలు, విశ్వవిద్యాలయాలకు యుజిసి సిఫార్సులు మాత్రమే చేయగలదని బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ప్రస్తుత వివాద పరిష్కారానికి ఆ రూలింగ్ తోడ్పడుతుంది.

('ద హిందూ' సౌజన్యంతో)
(వ్యాసకర్త లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్)

కవిత్వం

జాబిలి

రాహువు అడ్డపడ్డా చందమామ
గ్రహణ గర్భంలోంచి దాటుకొచ్చినట్టు
చీకటి మనసులు చుట్టుముట్టినా
ఆడపిల్ల వెన్నెలమ్మలా
పుచ్చపువ్వు నవ్వుతో
పురుషాహంకారాన్ని సరిదిద్దడానికే వస్తుంది
తూరుపు తెరపై ఆడపిల్లలా
తొలిసంధ్య పుడుతున్నప్పుడు
విశాలాకాశం సంకుచిత ముసురై
అడ్డుకొంటుంటే ఆమె తేజస్వినియై
వెలుగు కిరణాలతో
పురుషాధిక్య తిమిరాంధకారాన్ని
ఆకాశం అంచులదాకా తరిమికొడుతుంది
వివక్ష వైపరీత్యాలు దాటుకొని
ఉదయించింది మొదలు
పసిడి పాదాలతో గలగల ప్రవహిస్తూ
ఇంటిని కళకళ వెలిగిస్తూ
అమ్మానాన్నల్ని అలరిస్తూ
కంటికి రూపమై ఇంటికి దీపమై
అన్నింటికీ అపురూపమై
అందరికీ చేదోడు వాదోడై
తల్లిలా చెల్లిలా మమతల బుల్లిలా
పుట్టగానే పరిమళించే కల్పవల్లిలా
ఇంటింట వెలిగే దీపకళికే బాలిక!

(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

- భీమవరపు పురుషోత్తమ్,
రాజమండ్రి.
9949800253

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps
@gmail.com

జనాభా పెంపుదల ఎవరికోసం?

వ్యాఖ్య

> **ఈ కాలంలో యువతరం సంసార సాగరం ఈదేందుకు వెనుకాడుతున్నది. ఇది జనాభా క్షీణతకు దారితీస్తుంది. ఫలితంగా యువ శ్రామిక శక్తి గణనీయంగా తగ్గిపోతున్నది. పెళ్లి చేసుకొని పిల్లలను కనటానికి ముందుకు రావడం లేదు. సరైన ఉపాధి వేతనాలు లేకపోవడం, పెరుగుతున్న ఖర్చులను భరించలేకపోవటం, పిల్లలు ఆరోగ్య సంరక్షణ, చదువుల ఖర్చులు భరించలేనివిగా ఉండటం వీటన్నిటి వల్ల యువత పిల్లలను వెంటనే కనేందుకు ఉత్సుకత చూపటంలేదు. అలాగే కొందరు ఉపాధి దొరక్క పెళ్లిళ్లు చేసుకోవడం కూడా వాయిదా వేసుకుంటున్నారని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయి.**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య రాష్ట్రంలో పెద్ద ఎత్తున జనాభా పెంచాలని ప్రచారం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌లో కూడా దీనిని ఒక ప్రధాన అంశంగా పొందుపరిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే...గతంలో జనాభా నియంత్రణలో భాగంగా తీసుకొచ్చిన...ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత లేదనే చట్టాన్ని రద్దు చేశారు. ఇప్పుడు కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అర్హత కల్పిస్తూ త్వరలో చట్టం తేబోతున్నట్లు కూడా ప్రకటించారు. ఇకపై ఏ పథకం అమలు చేయాలన్నా కుటుంబ పరిమాణాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని, ఇకపై జనాభా పెంచేందుకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తామని ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్రంలో జనాభా పెంచాల్సిన అవసరాన్ని ప్రతిపాదిస్తూ దానికిగల కారణాలను కూడా తెలియజేస్తున్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే ఆర్థికంగా అభివృద్ధి చెందిన సంపన్న దేశంగా మారుతుందని, అలాగే ఆంధ్ర రాష్ట్రం కూడా 2.41 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థకు చేరి దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన రాష్ట్రంగా మారుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో జనాభా పెరుగుదల తగ్గే ప్రమాదం కనిపిస్తున్నదని ఇది ప్రమాదకరమని సూత్రీకరించారు. నేడు రాష్ట్ర జనాభా 5.38 కోట్లుగా ఉండగా 2031లో అది 5.42 కోట్లకు, 2036కి 5.44 కోట్లకు చేరి 2051కి 5.41 కోట్లకు పడిపోతుందని అంచనా వేశారు. 2026లో ఒక జంట సగటున 1.51 మందికి జన్మనిస్తే 2051 నాటికి 1.07కి తగ్గిపోతుందని, ఇది ప్రమాదకరమని కనుక ఒక జంటకు సగటున 2.1 మంది పిల్లలు జన్మిస్తేనే జనాభా స్థిరంగా కొనసాగటం సాధ్యమవుతుందని అంటున్నారు. ఈ అంచనాల ఆధారంగా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జనాభాను పెంచాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నారు. ముఖ్యంగా జనాభా పెంచడం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలో పెద్దయెత్తున యుక్త వయస్సు కలిగిన జనాభాగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవిస్తుందని, ఈ అవకాశాన్ని రాష్ట్రం ఉపయోగించుకొని ప్రతి కుటుంబం సుసంపన్నం అవుతుందనే వాదనను ముందుకు తెచ్చారు.

డా॥ బి. గంగారావు

చంద్రబాబు నాయుడు 2050 నాటికి యువ జనాభా కలిగి ఉండటం వల్ల వచ్చే ప్రయోజనాల గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారు. కాని నేడు ప్రపంచంలో అత్యంత యువ జనాభా కలిగిన దేశంగా భారత్ ఉంది. దేశ జనాభా ప్రస్తుత మధ్యస్థ వయస్సు 29.5 శాతంగా వుంది. యువత రూపంలోనేగాక పరిమాణంలో కూడా ఎక్కువ కోట్ల మంది యువ జనాభాను కలిగిన దేశం ప్రపంచంలో మరొకటి లేదు. 1991లో 15–59 వయస్సు మధ్య వున్న జనాభా 55.4 శాతం ఉండగా నేడు 65 శాతానికి పెరిగింది. ఈ వయస్సుల మధ్య వున్న జనాభానే పని చేయటానికి అందుబాటులో వున్న శ్రామిక జనాభాగా పరిగణిస్తారు.

నేడు ఇంత పెద్ద సంఖ్యలో అందుబాటులో వున్న శ్రామిక జనాభా ప్రపంచంలో మరే దేశంలో లేరు. అలాగే ప్రతి ఏడాది 25 ఏళ్ల లోపు వయస్సు వున్న యువత 2 కోట్లకు పైగా శ్రామిక మార్కెట్ లోకి వస్తున్నారు. ఈ జనాభాను ఎందుకు ఉపయోగించు కోవడంలేదు? దీనికి చంద్రబాబు సమాధానం చెప్పటంలేదు. చెప్పలేరు కూడా? ఎందుకంటే వీరు అనుసరిస్తున్న విధానాలే దీనికి ముఖ్య కారణం. అందువల్లే 65 శాతం శ్రమ చేసే జనాభా దేశం కలిగివున్నా, కేవలం 45.2 శాతం మాత్రమే వినియోగించుకోగలుగుతున్నది. పట్టణ ప్రాంత మహిళా శ్రామికులలో ఇది 23.4 శాతం గానే వుంది.

ఏ దేశమైనా శక్తివంతమైన జనాభా కలిగి ఉందనే దానికి రెండు ముఖ్యమైన సూచికలను పరిగణలోకి తీసుకుంటారు. ఆ జనాభాకి విద్య, వైద్య సదుపాయాలు, అవి అందుబాటులో ఉన్న తీరు, వాటి నిర్వహణలో ప్రభుత్వ పాత్ర కీలకమైనవిగా ఉంటాయి. ప్రపంచ దేశాలతో పోలిస్తే వీటిల్లో నేడు భారత దేశం, ఆంధ్ర రాష్ట్రం అత్యంత అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్ర అక్షరాస్యత చూస్తే నేటికీ 72 శాతం మాత్రమే. మహిళా అక్షరాస్యతలో ఆంధ్ర రాష్ట్రం దేశంలో 35వ ర్యాంకుతో అట్టడుగున వుంది. విద్యా నమోదు నిష్పత్తి, చదువు నుండి మధ్యంతరంగా వైదొలగడం దారుణంగా ఉన్నాయి. పదవ తరగతి లోపున 16.3 శాతం విద్యార్థులు చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఇంటర్ స్థాయికి వచ్చేసరికి 56.7 శాతానికే పరిమితం అవుతున్నారు. ఉన్నత విద్యకి వచ్చే సరికి అది 36.5 శాతానికి పడిపోయింది. పదేపదే నైపుణ్యం గురించి చంద్రబాబు మాట్లాడుతున్నారు. వృత్తి నైపుణ్యంలో చైనా తన జనాభాలో 60 శాతం మందిని కలిగి వుంటే, అదే భారతదేశం కేవలం రెండు శాతం, ఆంధ్ర రాష్ట్రం ఒక శాతంలోనే వున్నాయి.

ఇక ఆరోగ్య సూచికలు చూస్తే స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ళు దాటినా ఆందోళనకరంగానే ఉన్నాయి. జీవిత కాలపు సగటు వయస్సు రాష్ట్రంలో నేటికీ 70 ఏళ్ళు దాటలేదు. తీవ్ర రక్తహీనతతో బాధపడే మహిళలు 50.5 శాతం ఉన్నారు. అదే వయస్సుకు తగ్గ బరువు లేనివారు 36 శాతం ఉండగా ప్రసూతి మరణాలు 65, సమతుల్య పోషకాహారం తీసుకోలేని వారు 56 శాతం నేటికీ ఉన్నారు. అలాగే అంటువ్యాధులు ప్రబలి ప్రజలను ఎలా బలి తీసుకుంటున్నాయో చూస్తున్నాం.

నయా ఉదారవాద విధానాల అమలు ప్రారంభమైన తర్వాత దేశంలో ఈ విధానాలకు ఎక్కువ ప్రభావానికి గురైంది విద్యా, వైద్య రంగం. అందులో ఆంధ్ర రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ప్రైవేటు రంగాన్ని విస్తరించి లాభాల సరుకులుగా మార్చేశారు. ప్రభుత్వ పెట్టుబడుల కల్పన, ప్రభుత్వ జోక్యాన్ని ఈ రంగాల్లో దెబ్బ తీశారు.

ఈ పరిణామాలు సమాజాన్ని రెండుగా విభజిస్తున్నాయి. ఉన్నత సదుపాయాలు, సేవలు కేవలం కొద్ది మందికే ఈ రంగంలో పరిమితం కాగా, అత్యధిక మంది నాణ్యత లేని సేవలకే పరిమితం అయ్యారు. ఆరోగ్య సంరక్షణపై ఖర్చు పెట్టలేని వారి సంఖ్య పెరిగిపోతూ వయస్సు పైబడుతున్న వారు పెద్ద ఎత్తున అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. తగిన ఆదాయాలు లేకపోవడంతో కుటుంబాల్లో భారమైన వ్యక్తుల సంఖ్య పెరుగుతున్నది.

అలాగే అతి తక్కువ మంది యువతను నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా సృష్టిస్తూ అత్యధిక మందిని నైపుణ్యం లేని వారిగా మార్చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశం యువత ప్రపంచంలో ఏర్పడే అనేక నూతన అవకాశాలను కూడా అందిపుచ్చుకోలేక పోతున్నారు. వీటిని సరి చేయకుండా, విద్యా వైద్య రంగాలను ప్రభుత్వ పెట్టుబడులతో శక్తివంతమైనవిగా చేయకుండా పని చేసే వయస్సు కలిగిన వారి సంఖ్య పెరిగినా దేశ, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పుడు విజన్ 2047లో ఈ రంగాలను పూర్తిగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పి 4) పేరుతో ప్రైవేట్ శక్తుల పరం చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో యువ జనాభా భవిష్యత్‌లో పెద్ద ఎత్తున నిరుద్యోగానికి, దోపిడికి గురవుతారనేది వాస్తవం.

వాస్తవంగా ఈ కాలంలో యువతరం సంసార సాగరం ఈదేందుకు వెనుకాడుతున్నది. ఇది జనాభా క్షీణతకు దారితీస్తుంది. ఫలితంగా యువ శ్రామిక శక్తి గణనీయంగా తగ్గిపోతున్నది. పెళ్లి చేసుకొని పిల్లలను కనటానికి ముందుకు రావడం లేదు. సరైన ఉపాధి వేతనాలు లేకపోవడం, పెరుగుతున్న ఖర్చులను భరించలేకపోవటం, పిల్లలు ఆరోగ్య సంరక్షణ, చదువుల ఖర్చులు భరించలేనివిగా ఉండటం వీటన్నిటి వల్ల యువత పిల్లలను వెంటనే కనేందుకు ఉత్సుకత చూపటంలేదు. అలాగే కొందరు ఉపాధి దొరక్క పెళ్లిళ్లు చేసుకోవడం కూడా వాయిదా వేసుకుంటున్నారని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయి. ఇవన్నీ పాలకులు కోరుకుంటున్న వ్యవస్థ దుష్ఫలితాలే.

మరొక వాదనను కూడా చంద్రబాబు ముందుకు తీసుకొస్తున్నారు. స్థూల ఆర్థిక వృద్ధి రేటు బాగా పెంచటం ద్వారా పెద్ద యెత్తున ఉపాధి అవకాశాలు వస్తాయని, అవి అందుపుచ్చుకునే యువ కార్మిక శక్తి ఉండాలని అంటున్నారు. ఈ వృద్ధి ద్వారా సృష్టించే సంపద వల్ల పేదరికం, నిరుద్యోగం, అసమానతలు అన్నీ తొలిగి రాష్ట్ర జనాభా అత్యంత సంపన్నమైనదిగా మారుతుందని వాదిస్తున్నారు. వాస్తవంగా నయా ఉదారవాద విధానాల కాలంలో అంతక ముందు కన్నా దేశ వృద్ధి రేటు ఎక్కువగా కొనసాగుతున్నది. ఆంధ్ర రాష్ట్రంలో కూడా 10 శాతం పైనే గత దశాబ్దంలో కొనసాగింది. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం, పేదరికం అసమానతలు పెరిగాయి. దేశంలో ఉపాధి అవకాశాల పెరుగుదల లేకపోవడం ఒక ప్రధాన ధోరణిగా కొనసాగుతున్నదనేది వాస్తవం. యుక్త వయస్సు వచ్చి ఉపాధి కోరుకుంటున్న వారి సంఖ్య ఏ మోతాదులో ప్రతిఏడాది పెరుగుతుందో కనీసం ఆ స్థాయిలో కూడా ఉపాధి అవకాశాలు పెరగడంలేదు. కనుక జిడిపి, వృద్ధిరేటు పెరిగినంత మాత్రాన ఉపాధి అవకాశాలు వాటంతటవే పెరగటం లేదనేది గత మూడు దశాబ్దాల అనుభవం. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వ మద్దతు ఉపసంహరణతో ఇవి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారు.

నయా ఉదారవాద కాలంలో ఉపాధి రంగంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. శాశ్వత ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. కాంట్రాక్టు, క్యాజువల్ ఉద్యోగులు పెరుగుతున్నారు. ఉద్యోగ భద్రత లేని వారి సంఖ్య పెరుగుతున్నది. వేతనాలు అత్యంత ఘోరంగా ఉన్నాయి. అసంఘటిత రంగం పెరుగుతున్నది. పారిశ్రామిక కార్మికుల్లో పెరుగుదలలేదు. వ్యవసాయ రంగంలో వేతన ఉపాధి పడిపోతున్నది. కార్మిక చట్టాల్లో మార్పులు కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకువస్తున్నారు. వ్యవసాయ శ్రామికుల నిజవేతనాలు స్థంభించిపోయాయి. శ్రమ దోపిడి పెరిగింది. సంపద పోగుపడుతూ పెద్ద ఎత్తున సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి.

కనుక చంద్రబాబు నాయుడు తెర మీదకు తెచ్చిన జనాభా సిద్ధాంతం పెట్టుబడిదారుల దోపిడికి, వారి సంపద పోగు చేసుకోవడానికి దోహదం చేసేది తప్ప రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం మేలు చేసేది కాదు. అలాగే పెట్టుబడిదారుల దోపిడిని కప్పిపుచ్చే ప్రచారం ఇది. అలాగే నేడు ప్రజలు ఎదుర్కొనే సమస్యలను కూడా పక్కదారి పట్టించేది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కత్తిపోట్లు నిజమా? లేక నటనా?

- సైఫ్‌పై మహారాష్ట్ర మంత్రి నితేశ్ వ్యాఖ్యలు

ముంబయి : మహారాష్ట్ర మంత్రి, బిజెపి నాయకులు నితేశ్ రాణా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి గురించి మాట్లాడుతూ 'సైఫ్‌ను నిజంగా కత్తితో పొడిచారా.. లేక ఆయన నటిస్తున్నాడా?' అని నితేశ్ సందేహం వ్యక్తం చేశారు. డిశ్చార్జ్ తర్వాత సైఫ్ ఆస్పత్రి నుంచి డాన్స్ చేస్తూ బయటకు వచ్చారని, ఇంతకీ అతన్ని పొడిచారా? లేదా నటనా? అన్న అనుమానం వస్తోందన్నారు.

ఎన్‌టిఆర్ ఫొటో లేకుండా మోడీ, పవన్ కల్యాణ్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ

ఎన్‌టిఆర్ ఫొటో విస్మరించిన టిడిపి

- పార్టీ సొంత కార్యక్రమాల్లోనూ మోడీ, పవన్‌కు ప్రాధాన్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లలో పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ ఫొటోను, పేరును టిడిపి నాయకులు విస్మరించారు. ఆ ఫ్లెక్సీలో మోడీ, పవన్ కల్యాణ్ ఫొటోలు వేయడం కలకలం రేపింది. ఈ అంశం మీడియా కంట పడడంతో వారు వీడియోలు తీస్తున్నారని గ్రహించిన కార్యాలయ నిర్వాహకులు హడావుడిగా ఎన్‌టిఆర్ ఫొటోను ఫ్లెక్సీపై అంటించే ప్రయత్నం చేశారు. అంతేగాక పార్టీ నాయకులు మీడియాపై అసహనం వ్యక్తం చేశారు.

మీడియాలో ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో మంగళగిరిలోని జాతీయ కార్యాలయ నాయకుల దృష్టికి ఈ విషయం వెళ్లింది. ఈ వ్యవహారంపై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లా నాయకులను వివరణ కోరినట్లు సమాచారం. లోకేష్ జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి.

నేతాజీకి సిఎస్ నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాతృభూమిని దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేయడానికి ఆనాటి అత్యున్నత సర్వీసైన ఐసిఎస్‌ను సుభాష్ చంద్రబోస్ తృణప్రాయంగా త్యజించారని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని సిఎస్ కె.విజయానంద్ అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం సచివాలయంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి సిఎస్ నివాళులర్పించారు. జిఎడి ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సిఎం ముఖ్య కార్యదర్శి ఎం.రవిచంద్ర, కార్యదర్శులు ఎవి రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

275.07 కోట్లతో గిరిజన ఆవాసాలకు రోడ్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.275.07 కోట్లు కేటాయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పరిపాలనా అనుమతులిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కాకినాడ జిల్లాల పరిధిలో బలహీన గిరిజన సమూహాల (పివిటిజి) ఉన్న 90 ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు పిఎం జన్‌మన్ పథకం కింద 76 పనులను రూ.275.07 కోట్లతో చేపట్టనున్నారు. కేంద్రం వాటాగా రూ.163.39 కోట్లు కేటాయించగా, రాష్ట్ర వాటాగా రూ.111.68 కోట్లు కేటాయించింది. నిర్మాణ అనంతరం ఐదేళ్ల పాటు ఈ రహదారుల నిర్వహణకు మరో రూ.18.76 కోట్లు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అల్లూరి జిల్లాలో 285 కిలోమీటర్ల మేర 71 పనులకు రూ.246.16 కోట్లు, ఏలూరు జిల్లాలో 12.87 కిలో మీటర్ల మేర 2 పనులకు 12.80 కోట్లు, కాకినాడ జిల్లాలో 19.15 కిలోమీటర్ల మేర 3 పనులకు 16.10 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టిడిపి ఆఫీస్‌పై దాడి కేసులో

వల్లభనేని వంశీ బెయిల్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడికి వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సంబంధం లేదని, వంశీపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చెల్లదని సీనియర్ న్యాయవాది వి. పట్టాభి హైకోర్టులో వాదించారు. వంశీకి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేయవచ్చునని గతంలో వివిధ కోర్టు తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. ఈ మేరకు అనుబంధ పిటిషన్ వేసినట్లు చెప్పారు. దీనికి పోలీసుల తరపున పిపి ఎం.లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ వంశీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. దీంతో విచారణను వచ్చే నెల 6కి వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

విజయ్‌కుమార్‌రెడ్డి అధికార దుర్వినియోగంపై అధారాలున్నాయి : హైకోర్టులో ప్రభుత్వ వాదనలు

సమాచార, పౌర సంబంధాల మాజీ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి అధికార దుర్వినియోగంపై ఎసిబి నమోదు చేసిన కేసులో ఆధారాలు ఉన్నాయని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు. అక్రమాలపై విజిలెన్స్‌శాఖ నిర్దిష్టమైన ఆధారాలను సేకరించిందని, నిజానిజాలు రాబట్టేందుకు ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాల్సి వుందని అన్నారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు. తదుపరి వాదనల నిమిత్తం హైకోర్టు విచారణను ఈ నెల 27కి వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎసిబి నమోదు చేసిన కేసును విజయ్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో సవాలు చేశారు.

అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల పెట్టుబడులు

- సౌదీ యువరాజు వెల్లడి

దుబాయ్ : రాబోయే నాలుగేళ్ళ కాలంలో అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల (దాదాపు 51.87 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గురువారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, తన మొదటి విదేశీ పర్యటనగా బ్రిటన్‌లో పర్యటించడానికి ట్రంప్ యోచిస్తున్నారు. 2017లో ట్రంప్ ఇలాగే పర్యటించారు. చమురు సంపన్న గల్ఫ్ దేశాల పాలకులతో అమెరికా సంబంధాలు మెరుగైన రీతిలో వుండేందుకు తాము ప్రాధాన్యత ఇస్తామని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలని తాము కూడా భావిస్తున్నట్లు సౌదీ యువరాజు తెలిపారు. అయితే ఈ పెట్టుబడులు ఏ ఏ రంగాల్లో ఎక్కడెక్కడ పెడతారు, వాణిజ్య వివరాలు వంటివి ఆయననే జారీ చేసిన ప్రకటనలో వెల్లడించలేదు. ఇటీవల కాలంలో సౌదీ చమురు ఎగుమతులపై అమెరికా ఎక్కువగా ఆధారపడుతూ వస్తోంది. అలాగే అమెరికా తయారీ ఆయుధాలు, రక్షణ వ్యవస్థలపై సౌదీ అరేబియా ప్రధానంగా ఆధారపడుతోంది.

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayana Bhawan, Dabagardens, Visakhapatnam-530020.
Government Of India

Case No. OA 48 / 2022
Summons by way of Paper Publication under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of Rule 5 of the Debts Recovery Tribunal (Procedure) Rules, 1993.
Union Bank Of India, Kothapeta Branch
VS M/s Anjaneya Cotton Traders & 3 others

To,
Defendant No-1: M/s Anjaneya Cotton Traders, rep by its Proprietor Sri Challa Viswanadha Bhargava Reddy, S/o. Siva Venkata Reddy, rep by his GPA Holder Sri Siva Venkata Reddy, D.No.26-46-64/B, 2nd Line, NGO Colony, Guntur-522007. **Defendant No-2: Sri Challa Viswanadha Bhargava Reddy,** S/o. Siva Venkata Reddy, rep by his GPA Holder and Father Sri Challa Siva Venkata Reddy, D.No.26-46-64/B, 2nd Line, NGO Colony, Guntur-522007. **Defendant No-3: Sri Challa Siva Venkata Reddy,** S/o. Sambi Reddy, D.No.26-46-64/B, 2nd Line, NGO Colony, Guntur-522007. **Defendant No-4: Smt.Bhimanapati Varalakshmi,** W/o. Chandrasekhar Reddy, D.No.26-46-64/B, 2nd Line, NGO Colony, Guntur-522007.

SUMMONS

WHEREAS, **OA No.48/2022** was listed before the Hon'ble Presiding Officer/ Registrar on **04-02-2025**.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, **OA-48/2022** filed against you for recovery of debts of **Rs.8,99,42,786/-** (Application along with copies of documents etc. annexed). In accordance with Sub section (4) of Section 19 of the Act, you the defendants are directed as under:
(1) To show cause within 30 days of service of summons as to why relief prayed for should not be granted.
(2) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(3) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application. pending hearing and disposal of the application for attachment of properties.
(4) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of this business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the tribunal.
(5) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Presiding Officer on **04-02-2025** at **10.30 A.M** failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of the Tribunal on this date **13th day of December 2024.**

Signature of the Officer,
Authorised to issue summons

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
పెదపారుపూడి బ్రాంచ్ (బ్రాంచ్ కోడ్ - 3640), మెయిన్ రోడ్డు, పెదపారుపూడి, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521263

ముందస్తు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం జారీ చేయబడినది
వీరికి,
శ్రీ కోపూరి ఠాగూర్ కుమార్, తండ్రి : శ్రీ కె. మధుసూదనరావు (ఋణగ్రహీత & తనఖాదారు), డి.నెం. 4/4, పాత ఆర్.ఎస్.నెం. 203/1, కొత్త ఆర్.ఎస్.నెం. 203/8, పెదపారుపూడి, కృష్ణాజిల్లా, పిన్ - 521263.
సర్ / మేడమ్

శ్రీ కోపూరి ఠాగూర్ కుమార్, తండ్రి : శ్రీ కె. మధుసూదనరావు గారి ఎన్‌పిఏ హోమ్ లోన్ అకౌంట్ నెం.364003464000006 గురించి

1. SARFAESI ACT-2002 లోని నిబంధనల ప్రకారం మీపై ప్రారంభించబడిన రికవరీ చర్యల గురించి తెలియజేస్తూ.
2. ఈ దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **తేది.02-03-2023**న దిగువ షెడ్యూలులో పేర్కొన్న సెక్యూర్డు ఆస్తులను స్వాధీనత తీసుకోవడం గురించి స్వాధీనత నోటీసు జారీ చేయడమైనది. సదరు స్వాధీనతా ప్రకటనను **తేది.07.03.2023న ఈనాడు (తెలుగు దినపత్రిక) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీషు దినపత్రిక)** లలో ప్రచురించబడినది. ఈరోజు వరకు మీరు బ్యాంకునకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించలేదు.
3. మీరు అనగా పైన తెలిపిన ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు **తేది.21.12.2022** నాటి డిమాండ్ నోటీసు మరియు **తేది.02.03.2023** నాటి స్వాధీనతా నోటీసు జారీ చేసిన తరువాత పూర్తి బకాయి చెల్లించడంలో విఫలమైనారు. అందువలన దిగువ షెడ్యూలులో తెలిపిన సెక్యూర్డు ఆస్తులను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్స్ 8 & 9తో చదువబడే సెక్షన్ 13(4) చట్టం ప్రకారం **"ఎక్కడ ఎలా వున్నది అలానే" "ఏది ఎలా వుంటే అలానే"** పద్ధతిపై విక్రయించాలని ప్రతిపాదించబడినది.
4. లోను ఖాతా యొక్క బకాయి **తేది.03.12.2024** నాటికి **రూ.14,36,064.61** పై మరియు ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు/ఛార్జీలు మొ॥నవి, పూర్తిగా తిరిగి చెల్లించే తేదీ వరకు చెల్లించవలసి ఉంటుంది.
5. బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి **తేది.03.12.2024** నాటికి **రూ.14,36,064.61** పై చెల్లించడానికి మీకు SARFEASI చట్టం ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) క్రింద మీకు 30 రోజుల నోటీసు ఇస్తున్నాము. తదుపరి, మీరు చట్టం సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) యొక్క నిబంధనల ప్రకారం సెక్యూర్డ్ అస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.
6. మీరు పైన పేర్కొన్న విధంగా బ్యాంకుకు బకాయిలను చెల్లించడం ద్వారా ఆస్తులను విడిపించుకోవడంలో విఫలమైతే, SARFEASI చట్టం యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని నిబంధనల ప్రకారం బకాయిలను రాబట్టుకొనుటకు ఆస్తులు విక్రయానికి ఉంచబడతాయి.

ఆస్తుల షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ - 521263, కృష్ణాజిల్లా, పెదపారుపూడి గ్రామం & మండలం, ఆర్.ఎస్.నెం.203/1, కొత్త ఎస్.నెం.203/8, డి.నెం.4/4లోని 123 చ॥గ॥ల విస్తీర్ణంతో గల నివాస ఇల్లు యావత్తు ఆస్తి. హద్దులు: **తూర్పు** : శ్రీరంగం శ్రీనివాస చక్రవర్తి గారి ఆస్తి - 46", **దక్షిణం:** పంచాయితీ బజారు - 24", **పడమర** : పాలడుగు చంద్రశేఖరరావు గారి స్థలం - 46", **ఉత్తరం** : గోగినేని మధుసూదనరావు గారి స్థలం మరియు ఉమ్మడి బజారు - 24".

తేది : 31-12-2024 — అధీకృత అధికారి
ప్రదేశం: పెదపారుపూడి — ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

Chola Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు : "చోళా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు.వి.క. ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు, ఇండియా. శాఖ చిరునామా : 9-11-5-ఎ, 1వ అంతస్తు, మహమ్మద్ మొహిద్దీన్ ముంతాజ్ మ్యాన్షన్, అరండల్‌పేట, నరసరావుపేట, గుంటూరు (జిల్లా)-522601. శాఖ చిరునామా : 2వ అంతస్తు, డో.నం.29-2465/5, ఆర్ఎస్ నం.340/2బి1, బ్లాక్ నం.29, వార్డు నం.1, కారంపుడి రోడ్డు, వినుకొండ, గుంటూరు జిల్లా (ఎపి)-522647. శాఖ చిరునామా : 4వ అంతస్తు, గుప్తా స్క్వేర్, 'బి' బ్లాక్, షాప్ నం.5, 60 అ.లు. రోడ్డు, సత్యం థియేటర్ ప్రక్కన, ఒంగోలు-523001. శాఖ చిరునామా: 1వ అంతస్తు, డో.నం.7/308హెచ్, విజయ టాకీస్ రోడ్డు, పేరం బజారు, మార్కాపురం, ప్రకాశం జిల్లా-523316.

రూల్ 8(1) క్రింద స్వాధీనతా నోటీసు

ఏదైతే, దిగువసంతకందారు అయిన మెసర్స్.**చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ఇకపై చట్టంగా పిలువబడుతుంది క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని డిమాండ్ నోటీసు జారీచేసి కాలం (సి)లో సూచించిన తేదిన దిగువ కాలం (బి) లో పేర్కొన్న పేర్లగల రుణగ్రహీతలకు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా కాలం (డి)లో గుర్తించిన బకాయి మొత్తాలును దానిపై వడ్డీతోసహా తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా దిగువసంతకందారు ఇక్కడ రూపొందించబడిన రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమంచిన అధికారాలను వినియోగించుకొని కాలం (ఇ)లో పేర్కొన్న తేదీలపై తాకట్టుపెట్టబడిన ఆస్తులను **లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోవడమైనది.**
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, పేర్కొన్న ఆస్తులతో లావాదేవీలు జరుపరాదు మరియు అట్టి లావాదేవీలును కాలం (డి)లో పేర్కొన్న మొత్తాలును వడ్డీ మరియు ఇతర చార్జీలతోపాటు **మెసర్స్. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** కు చెల్లించుటకులోబడి లావాదేవీలు జరుపుకొనుట ఉంటుంది. రుణగ్రహీతలు జాగ్రత్త వహించవల్సినదిగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) [illegible]

క్ర. సం. [A]	రుణగ్రహీత పేరు మరియు చిరునామా మరియు లోను ఖాతా సం. [B]	డిమాండ్ నోటీసు తేది [C]	బకాయి మొత్తం [D]	స్వాధీనత తేది [E]
1	లోన్ అకౌంట్ నం.: HE01NUK00000045963 — 1. షేక్ చిన్న మహమ్మద్ ఖాసీం (దరఖాస్తుదారు), 2-160-5, మెయిన్ రోడ్, ఎర్రగొండపాలెం, ప్రకాశం, ఆంధ్రప్రదేశ్-523327. షేక్ చిన్న మహమ్మద్ ఖాసీం (దరఖాస్తుదారు), ... [illegible]	08-10-2024	08-10-2024 నాటికి రూ.38,32,503/-	21-01-2025

ఆస్తి వివరాలు : [illegible]

అంతుచిక్కని వ్యాధితో బాధపడేవారున్న ఇళ్లకు అధికార యంత్రాంగం ప్రత్యేక సీల్ వేసి గ్రామంలో పలు ఆంక్షలు విధించారు. కంటైన్‌మెంట్ జోన్‌గానూ ప్రకటించారు. గ్రామంలో ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు సమావేశాలు జరపకూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. అలాగే, బాధిత కుటుంబాలు, వారి సన్నిహితులు ప్రభుత్వ అధికారులు అందించే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని.. వారి ఇళ్లలో ఉన్న ఇతర పదార్థాలను వినియోగించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఈ మరణాలపై విచారణలో భాగంగా బాధిత కుటుంబాల ఇళ్లలోని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకొని పరీక్షించాలని ప్రభుత్వం ఆదేశించింది. 11 మందితో కూడిన బృందం ఈ మరణాలపై దర్యాప్తు చేస్తోంది.

కేంద్ర హోంశాఖ అధికారి నేతృత్వంలో కమిటీ

బుధాల్‌లో చోటుచేసుకున్న మరణాలకు కారణాలను కనుక్కునేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కేంద్ర హోంమంత్రిశాఖ సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఈ కమిటీలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమంతో పాటు ఎరువులు, రసాయనాలు, వ్యవసాయం, నీటి పారుదల రంగాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక కమిటీని నియమించి కారణాలను అన్వేషిస్తున్నట్లు జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది.

అంటువ్యాధి కాదు : కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్

కాగా, ఈ మరణాలపై కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ రాజౌరీలో చోటుచేసుకున్న మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారణం కాదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఇది అంటువ్యాధి కాదన్నారు. వెల్లడించారు. కొన్ని విషపూరిత పదార్థాలను గుర్తించామని, అయితే అవి ఏమిటో నిర్ధరించే దిశగా దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ మరణాల వెనుక ఏదైనా కుట్రకోణముందా? అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని తెలిపారు.

రాజౌరీలో వ్యాధి ప్రబలిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంటైన్‌మెంట్ జోన్‌లో పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

26న చైనాకు భారత విదేశాంగ కార్యదర్శి

న్యూఢిల్లీ : చైనా పర్యటన కోసం ఈ నెల 26న కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ బయలుదేరి వెళ్లనున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా గత నాలుగేళ్ల విరామం తరువాత భారత్-చైనా మధ్య అన్ని స్థాయిల్లో ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు ఈ పర్యటన ఒక ఉదాహరణగా భావిస్తున్నారు. విక్రం మిస్రీ ఈ పర్యటనలో చైనా విదేశాంగ శాఖ మంత్రి సన్ వీడాంగ్‌తో చర్చలు జరపనున్నారు. ఈ చర్చల్లో వీసా, మానససరోవర్ యాత్ర, వాణిజ్య విషయాలు వంటి అంశాలు చర్చకు రానున్నట్లు సమాచారం. ఈ నెల 26న న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ తరువాత చైనాకు బయలుదేరి వెళతారు. తరువాత రోజు కూడా చైనా పర్యటనలో ఉంటారు. మిస్రీ గతంలో చైనాలో భారత రాయబారి(2019–2021), డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ (2021–2024)గా పనిచేశారు.

రాహుల్‌గాంధీకి అస్వస్థత

న్యూఢిల్లీ : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన పాల్గొనాల్సిన ఎన్నికల ప్రచార సభను రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం గురువారం ముస్తఫాబాద్‌లో ఎన్నికల ప్రచారాన్ని రాహుల్ నిర్వహించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు దేవేందర్ యాదవ్ తెలిపారు. అయితే శుక్రవారం మాదిపూర్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచారసభలో రాహుల్ గాంధీ పాల్గొంటారని తెలిపారు.

రికవరీ ఆఫీసర్-II వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

R.P. No.380 of 2023 in OA No. 557 of 2018

కెనరా బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, గుంటూరు
(ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ ద్వారా)
వర్సెస్
M/s. కృష్ణ సాయి ట్రేడర్స్ మరియు ఇతరులు

విషయం: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా 03.12.2024 తేదీతో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ప్రకారం https://www.bankeauctions.com వెబ్‌సైట్‌లో 24.01.2025వ తేదీన జరుపవలసిన షెడ్యూలు ఆస్తుల ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం థర్డ్ పార్టీ ఫైల్ చేసిన క్లెయిమ్ పిటీషన్ దృష్ట్యా, సిహెచ్ఆర్ బ్యాంక్ యొక్క అభ్యర్థన మేరకు తేది **07.02.2025 నకు వాయిదా వేయడమైనది.** తేది 03.12.2024 తో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ఇతర నియమనిబంధనలలో ఏ మార్పు లేదు.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.22-01-2025 న జారీచేయడమైనది)
(బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు) రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr & 1st Floor, Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

OA.No. 1003 / 2024

BETWEEN:
Union Bank of India, Enikepadu Branch, Krishna District, Rep., by its Chief Manager .....Applicant
And
Mrs. Koppala Santha Kumari, W/o. K.Ganesh ....Defendants
SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
SD: Mrs. Koppala Santha Kumari, W/o. K. Ganesh, aged 38 years, R.S. No. 119/2B, Nearest D. No. 1-17, FOF-1, 4th Floor, Harshita Enclave, Ram Nagar, Near Ramalayam Temple, Nidamanuru Village and Grama Panchayat, Vijayawada Rural Mandal, NTR District-521104. **And also at: Mrs. Koppala Santha Kumari,** W/o. K. Ganesh, aged 38 years, D.No.61-22-14A, Gulabi Thota, Krishna Lanka, Vijayawada, Andhra Pradesh-520013.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **29.01.2025** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/ Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before the proceedings will be heard and determine in your absence.
Given under my hand and Seal of the Tribunal on this the **22nd day of January, 2025** At Visakhapatnam.

Signature of the Officer Authorized
Debts Recovery Tribunal, Visakhapatnam.

OFFICE OF THE RECOVERY OFFICER -II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES,MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21,Sai Baba Street,Narayana Bhavanam, Dabagardens,Visakhapatnam-530020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P No. 1178 of 2019 in OA No. 155 of 2018

Union Bank of India, Ayodhyanagar Branch, Vijayawada, Krishna District.
Versus
Smt. Puli Phani Jyothi

To,
(CDR 1) Smt.Puli Phani Jyothi, W/o Srinivasa Rao, D.No. 34-02-22, Opp. Pushpa Hotel, Pushpa Hotel Centre, Vijayawada-520010.
1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in OA/155/2018 an amount of **Rs. 30,45,551.75Ps. (Rupees Thirty Lakh Forty Five Thousand Five Hundred Fifty One And Paisa Seventy Five Only)** along with pendentellite and future interest @9.65% p.a with monthly rests w.e.f 17.01.2018 till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **25.02.2025** at 10.30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date : 10.12.2024.
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

ఇన్‌కాయిస్‌కు నేతాజీ 'ఆప్ద ప్రబంధన్' పురస్కారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విపత్తుల నివారణకు నిస్వార్థ సేవలందించే పౌరులకు, సంస్థలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అందజేసే ప్రతిష్టాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఆప్ద ప్రబంధన్' పురస్కారం ఈ ఏడాదికి గాను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కాయిస్)కు లభించింది. ఈ పురస్కారం కింద రూ.51 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. నేతాజీ జయంతి సందర్భంగా గురువారం నాడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రకటించింది. ఈ పురస్కారానికి గతేడాది జులై నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ..295 నామినేషన్లు వచ్చినట్లు హోంశాఖ వెల్లడించింది. వీటిలో ఇన్‌కాయిస్‌ను పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది.

10 నిమిషాల్లో సునామీ హెచ్చరికలు

హైదరాబాద్‌లో 1999లో స్థాపించిన ఇన్‌కాయిస్ సముద్ర సంబంధిత ప్రమాదాల గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో ప్రఖ్యాతిగాంచింది. ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్ (ఐటిఇడబ్ల్యుసి) వ్యవస్థతో 10 నిమిషాల్లోనే ఈ సంస్థ సునామీ హెచ్చరికలను అందజేయగలదు.

భారత్‌తో పాటు 28 దేశాలకు సేవలందిస్తోంది. సునామీ సర్వీస్ ప్రొవైడర్ గా యునెస్కో సైతం ఇన్‌కాయిస్‌ను గుర్తించింది. భూకంప కేంద్రాలు, అలల తీవ్రత, ఇతర సముద్ర సెన్సార్ల నెట్‌వర్క్‌కు ఈ సంస్థ సమాచార సేవలందిస్తోంది. 2013 ఫైలిన్, 2014 హుద్హుద్ తుఫాను సమయంలో అందించిన సలహాలు, సహాయంతో సకాలంలో ప్రజల తరలింపు, తీరప్రాంత ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్రం పోశించింది. సముద్రంలో గల్లంతైన వ్యక్తులు, వస్తువులను గుర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు సహకారం అందించేందుకు ప్రత్యేకంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఎయిడెడ్ టూల్ (సరత్)ని అభివృద్ధి చేసి ఇన్‌కాయిస్ సేవలందిస్తోంది.

ఐఫోన్ పనితీరులో సమస్యలు

- యాపిల్ సంస్థకు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ: ఐఫోన్ పనితీరులో సమస్యలు వస్తుండటంతో దాని తయారీ సంస్థ అయిన 'యాపిల్'కు కేంద్ర ప్రభుత్వం గురువారం నోటీసులు జారీ చేసింది. వినియోగదారుల రక్షణకు చెందిన సిసిపిఎ ఆ నోటీసుల్ని జారీ చేసినట్లు చేసినట్లు కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత సిసిపిఎ ద్వారా యాపిల్ సంస్థకు తమ శాఖ నోటీసులు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. తన సోషల్ మీడియా ఖాతా ద్వారా మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. ఐఫోన్ల పనితీరుపై నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదులు అందినట్లు మంత్రి చెప్పారు. ఐఓఎస్ 18 సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల.. ఐఫోన్లలో సమస్యలు వస్తున్నాయని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ సిపిపిఎ యాపిల్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల ఉత్పన్నం అవుతున్న టెక్నికల్ సమస్యల గురించి యాపిల్ సంస్థ వివరణ ఇవ్వాల్సివుంది.

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES, MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21, Narayana Bhavanam, Saibaba Street, Daba Gardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P.No.644 of 2018 in OA No.843 of 2018
Indian Bank, Mukhasa Mutyalampadu Branch, Vijayawada, Krishna District.
Versus
Mr. Nimmagadda Jitendra Babu

To
(CDR 1) Mr. Nimmagadda Jitendra Babu, Proprietor M/s. Sri Lakshmi Enterprises, D.No.119/1, Ikkuru, Narasaraopet, Guntur District.
This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal. Visakhapatnam in OA/843/2018 an amount of **Rs.59,32,972/- (Rupees Fifty Nine Lakh Thirty Two Thousand Nine Hundred Seventy Two Only)** due under following loan accounts viz. for OCC Loan amount of **Rs.53,70,970/-** with interest @15.70% p.a. with compounded monthly rests and for Term Loan amount of **Rs.5,62,002/-** with interest @14.95% p.a. with compounded monthly rests w.e.f. **24-07-2018** till realization and costs has become due against you (Jointly and Severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **07-02-2025 at 10.30 a.m** for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings:
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date: **20-12-2024**
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer.

ఆధార్ ముడి ఉపాధికి మంచిదనేది ఒట్టిమాటే

- లేబర్ జర్నల్‌లో అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : ఆధార్ ఆధారిత చెల్లింపుల వల్ల ఉపాధి హామీ కార్మికులకు మేలు కన్నా కీడే ఎక్కువ జరుగుతోందని ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లుగా వ్యవహరిస్తున్న బిజెపి ప్రభుత్వం యేటికేడూ నిధులు తెగ్గోస్తూ రావడంతో పాటు అనేక ఆంక్షలు విధిస్తూ వస్తున్న సంగతి విదితమే. ఇందులో భాగంగానే ఉపాధి హామీ కార్మికులకు ఆధార్ ఆధారితంగా చేసుకొని వేతన చెల్లింపులు చేస్తామంటూ ఆధార్ చిక్కుముడులు బిగించింది. వేతన చెల్లింపులకు 2024 జనవరి 1 నుంచి ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది. దీనివల్ల ఉపాధి కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని, పథకంలో అవినీతికి చోటులేకుండా పారదర్శకతను పెంపొందిస్తుందని ఊదరగొట్టింది. అయితే కేంద్రం చెప్పిన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ తేల్చింది. ఈ మేరకు తన తాజా సంచికలో అధ్యయనంలో వెలుగుచూసిన వాస్తవాలను పేర్కొంది. ఆధార్ అనుసంధానం వల్ల మేలు జరుగుతుందనేది ఒట్టిమాటేనని అందులో స్పష్టం చేసింది. ఉపాధి హామీని మరింత సమర్థవతంగా అమలు చేయడానికి, పారదర్శకత పెంచడానికి ఇది ఉపయోగ పడుతుంది అని చెప్పేందుకు ఎటువంటి ఆధారాలు లేవని తెలిపింది. పైపెచ్చు దీనివల్ల ఉపాధి కార్మికులకు మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొంది.

పేదలకు భూ పంపిణీ చేయాలి : బి వెంకట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పేదలకు భూ పంపిణీ చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. భూమి లేని ప్రతి నిరుపేద కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండెకరాల చొప్పున సాగుభూమి ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల కొనుగులు శక్తి పెరగకుండా అభివృద్ధి సాధ్యపడదని ఆయన అన్నారు. పేదలకు భూ పంపిణీ చేయకుండా బడా కంపెనీలు పెట్టుబడులతో ఒరిగేదేమీ ఉండదన్నారు.

పెట్టుబడుల ముసుగులో సాగు భూములను, అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం సరైంది కాదని, వనరుల కబ్జా చేయడం కోసమే పెట్టుబడిదారులు ఈ నాటకాలు ఆడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి నేతృత్వ కూటమి ప్రభుత్వం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకులంగా పాలన సాగిస్తోన్నాయని విమర్శించారు. పోటాపోటీగా కార్పొరేటర్లకు లక్షలాది ఎకరాల భూములు ఇచ్చేందుకు సిద్ధపడటం సిగ్గుచేటున్నారు. దావోస్‌లో దేశానికి ప్రత్యకించి తెలుగు రాష్ట్రాలకు లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ప్రకటిస్తున్నారని, అయితే గతంలో దావోస్‌కి వెళ్లి ఎన్ని పెట్టుబడులు, ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రశ్నించారు.

OFFICE OF THE RECOVERY OFFICER -II
DEBTS RECOVERY TRIBUNAL
(DEPARTMENT OF FINANCIAL SERVICES,MINISTRY OF FINANCE, GOVERNMENT OF INDIA)
31-31-21,Sai Baba Street,Narayana Bhavanam, Dabagardens,Visakhapatnam-530020

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
R.P No. 346 of 2019 in OA No. 328 of 2018

Union Bank of India, Ayodhyanagar Branch, Vijayawada, Krishna District.
Versus
Smt. Adavi Janaki

To,
(CDR 1) Smt.Adavi Janaki, W/o Nageswara Rao, D.No. 20-3/1-93, GF-3, Sivasadanam, Brahmin Street, Ayodhyanagar, Vijayawada, Krishna District.
1. This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam in OA/328/2018 an amount of **Rs. 36,38,025.61Ps. (Rupees Thirty Six Lakh Thirty Eight Thousand Twenty Five And Paisa Sixty One Only)** along with pendentellite and future interest @9.65% p.a compounded with monthly rests w.e.f 17.02.2018 till realization and costs has become due against you (Jointly and severally/ Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of your assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **25.02.2025** at 10.30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay:
(a) Such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings.
(b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.
Given under my hand and the seal of the Tribunal, on this date : 10.12.2024.
(B.N.S.V.S.K.BANGARRAJU)
Recovery Officer

ఐదేళ్లలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాం

- ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రాధాన్యత. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు మా బృందం ఒక ప్రణాళికను రూపొందిస్తోంది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం రెండేళ్లలో 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. అలాగే, మూడు లక్షలకు పైగా ప్రైవేటు రంగ ఉద్యోగాలను కల్పించాం. ఉపాధి ఎలా సృష్టించాలో మాకు బాగా తెలుసు. ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

యోగీ.. యుపిలో విద్యుత్ కోతల మాటేమిటి?

ఆప్ పాలనలో ఢిల్లీని డంపింగ్ యార్డులా మార్చేశారని, 24 గంటల విద్యుత్ అందించడంలేదంటూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల చేసిన ఆరోపణలను కేజ్రీవాల్ తిప్పికొట్టారు. గురువారం పశ్చిమ ఢిల్లీలోని హరినగర్‌లో ఆప్ అభ్యర్థి తరఫున నిర్వహించిన ప్రచార సభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లో కరెంటు కోతల మాటేమిటని? యోగిని ఆయన ప్రశ్నించారు. 'నేను చాలా మందిని అడిగా. ఢిల్లీలో 24 గంటలూ విద్యుత్ అందుబాటులో ఉందని చెబుతున్నారు. ఆప్ సర్కార్ ఢిల్లీలో పదేళ్లుగా ఉంది. ఐదేళ్లలోనే 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురాగలిగాం. యుపిలో బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం రోజుకు ఎన్ని గంటలు విద్యుత్ అందిస్తోందో? యోగిజీ పరిశీలించుకోవాలి' అని కేజ్రీవాల్ అన్నారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr & 1st Floor, Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

OA.No. 893 / 2024

BETWEEN:
Union Bank of India. (Erst While Andhra Bank), Krishnalanka Branch, Vijayawada, Rep., by its Chief Manager .....Applicant
And
M/s. Sandhya Garments, Rep by It's Prop: Mrs. Nuthalapati Salomi Rani and Another .....Defendants
SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
D1. M/s. Sandhya Garments, Rep by It's Prop: Mrs. Nuthalapati Salomi Rani, D.No. 19-69/2, F4 KM Plaza, Mahendra Nagar, Gollapudi, Vijayawada. **D2. Mrs. Nuthalapati Salomi Rani,** W/o. Nuthalapati Jaya Rao, aged 55 years, 530, C-Block, JP Apartment, Near: Old Beeruva Company, Old Rajarajeswari Peta, Vijayawada, Andhra Pradesh-522002.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 & 2) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **29.01.2025** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/ Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before the proceedings will be heard and determine in your absence.
Given under my hand and Seal of the Tribunal on this the **22nd day of January, 2025** At Visakhapatnam.

Signature of the Officer Authorized
Debts Recovery Tribunal, Visakhapatnam.

'వెలిగొండ'కు రూ.4 వేల కోట్లు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నారని, పంటలు కూడా పండని పరిస్థితి ఉందని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలు కూడా లేనికారణంగా జిల్లావాసులు దూరప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వివరించారు. ఇవి ఎంతకాలం కొనసాగాలని ప్రశ్నించారు. వెలిగొండ సాధన కమ్యూనిస్టుల ఒకరికే సమస్య కాదని, ప్రజలందరి సమస్య అని, ఐక్యంగా ప్రజా ఉద్యమాలను చేపట్టాలిన్నారు. కేంద్రం నుంచి వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించేలా చంద్రబాబు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

అంతకుముందు ఒంగోలులోని సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య ఇంటికి రాఘవులు వెళ్లారు. ఇటీవల అనారోగ్యానికి గురైన సిద్ధయ్య సతీమణి అంజమ్మను కలిసి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు ఉన్నారు.

ఎపి బ్రాండ్ @ దావోస్

(మొదటి పేజీ తరువాయి)

ఎల్జీకెమ్ సిఇఓ పిన్ హక్ చియోల్‌కు సూచించారు. ఇంటిగ్రేటెడ్ బ్రూవరీ, బాట్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని పళ్లరసాలు, శీతల పానియాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్‌వాటర్ ఉత్పత్తి చేసే కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ సిఇఓ జాకబ్ అరుప్ అండర్సన్‌ను కోరారు. నాణ్యమైన ఉత్పత్తులను సేకరించేందుకు ఎపి రైతులతో భాగస్వామ్యం కావాలనీ సూచించారు. అనకాపల్లిలో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడితో 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ స్టీలు ప్రాజెక్టుపై ఆర్సెలార్ మిట్టల్/నిప్పన్ స్టీలు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, సిఇఓ ఆదిత్య మిట్టల్‌తో సంప్రదింపులు జరిపారు. వెల్స్‌పన్ ఛైర్మన్ గోయెంకాతో చంద్రబాబునాయుడు చర్చించారు.

ముఖ్యంగా గూగుల్ క్లౌడ్ సిఇఓ థామస్ కురియన్, పెట్రోనాస్ సిఇఓ మహ్మద్ తౌఫిక్, పెప్సికో సిఇఓ యూజీన్ విల్లెంసెన్, పెప్సికో ఫౌండేషన్ ఛైర్మన్ స్టీఫెన్ కెహోతోనూ చర్చలు జరిపారు. బహ్రెయిన్ ప్రైమ్ మినిస్టర్ హమద్ ఆల్ మహ్మద్, ముంతాలకత్ సిఇఓ అబ్దుల్లా బిన్ ఖలీఫా ఆల్ ఖలీఫాకూ రాష్ట్రంలో తీసుకొస్తున్న పాలసీలను వివరించారు. హిందూస్థాన్ యూనీలీవర్ చీఫ్ సప్లయి ఆఫీసర్ విల్లెం ఉజ్జెన్, సెన్మట్ సంస్థ హెడ్ రాబర్టో బొకాతో సమావేశమ య్యారు. వీటితోపాటు డిపి వరల్డ్, బిల్‌గేట్స్‌తోనూ చర్చలు జరిపారు. సాంకేతిక రంగంలో సహకరించాలని కోరారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr & 1st Floor, Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

OA.No. 861 / 2024

BETWEEN:
Union Bank of India, Bharathinagar Branch, Vijayawada, Krishna District, Rep., by its Senior Branch Manager .....Applicant
And
Mrs. Valiveit Rama Geetha Praveena and Another ....Defendants
SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To,
D1) Mrs. Valiveti Rama Geetha Praveena, W/o. Ashwini Kumar, D.No. 5-6-5P, Tammina Street, Near: Sri Ram Theater, Vijayawada-520009. **And also at: Mrs. Valiveti Rama Geetha Praveena,** W/o. Ashwini Kumar, D.No. 13-203, RS. No. 67/4, Old Bunk Bazzar, Sundaraiah Nagar Road, Kesarapalli, Gannavaram Mandal, Krishna Dist. **And also at: Mrs. Valiveti Rama Geetha Praveena,** W/o. Ashwini Kumar, D.No. 1513/7, Mattam Street, Palakollu, W.G. Dist-534260. **D2: Mr. Valiveti Ashwini Kumar,** S/o. Nataraj Gupta, D.No. 5-6-5P, Tammina Street, Near Sri Ram Theater, Vijayawada-520009. **And also at: Mr. Valiveti Ashwini Kumar,** S/o. Nataraj Gupta, D.No. 1513/7, Mattam Street, Palakollu, W.G. Dist-534260. **And also at: Mr. Valiveti Ashwini Kumar,** S/o. Nataraj Gupta, D.No. 21-10-1, Ramachandra Colony, H/o. Maturi Narayana Murthy, Palakollu, W.G. Dist-534260. **And also at: Mr. Valiveti Ashwini Kumar,** S/o. Nataraj Gupta, D.No. 13-203, R.S. No. 67/4, Old Bunk Bazzar, Sundaraiah Nagar Road, Kesarapalli, Gannavaram Mandal, Krishna Dist.

Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of debts due to banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1&2) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **28.01.2025** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a pleader/ Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before the proceedings will be heard and determine in your absence.
Given under my hand and Seal of the Tribunal on this the **22nd day of January, 2025** At Visakhapatnam.

Signature of the Officer Authorized
Debts Recovery Tribunal, Visakhapatnam.

మీ కోసం

పిండి వంటలు చేసేటప్పుడు నూనెలో కొంచెం చింతపండుగాని, బెల్లం ముక్క గాని వేస్తే నూనె పొంగకుండా ఉంటుంది.

జీవన సౌరభం

గొప్ప పనులు చేయలేకపోతే - చేసే చిన్నపనినైనా గొప్పగా చేయడం నేర్చుకోవాలి.

ఇదే మా సందేశం

పచ్చిక బయళ్ళలో
కుందేటి గెంతులు ఇచ్చే సంతోషాన్ని
పురాతన కట్టడాలపైనో
మన బంగళాలపైనో
రెక్కలాడిస్తూ ఎగిరే కపోతాలు
ఇచ్చే సందేశాన్ని
శత్రువంటూ ఎక్కు పెట్టిన
ఏ మారణాయుధాలూ ఇవ్వవు.
ప్రపంచమంతా శాంతి కోసం తపిస్తుంటే
దేశాల మధ్య యుద్ధక్రీడలు
కలవరబెడుతున్నాయి
పరాయి దేశాలు పచ్చి గాయాలతో
రక్త మోడుతున్నాయి ఇప్పుడు
.
ఓ ప్రపంచమా!
ఓసారి ఇటు చూడు
శాంతి కపోతాలు మాకు కావాలి
కులం, మతం అని వినిపించిన ప్రతిసారీ
మోగిస్తాం నిత్యం
నిరాయుధీకరణకై
మోగిస్తాం అహింసా శాంతి ఘంటికలు!

- పి.దివ్యప్రియ, 8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఈ బొమ్మ పేరు పక్కనే గజిబిజిగా ఇచ్చాం. క్లూ ఆధారంగా బాక్సుల్లో ఆ అక్షరాలను రాస్తే బొమ్మ పేరు వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ

- ఏల యశ్వంత్,
8వ తరగతి,
జడ్పీ స్కూలు, రాంపూర్,
నిజాంపేట మండలం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అమ్మ కడుపు నుంచీ గండాలే ..!

అమ్మ కడుపులో పడినప్పటి నుంచి ఆడపిల్లలకు అడుగడుగునా గండాలెన్నో పొంచివుంటున్నాయి. అపహరణలు, అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులతో ఆడపిల్లలకు ఎక్కడా భద్రత లేకుండా పోతోంది. కామాంధుల కర్కశత్వానికి ముక్కుపచ్చలారని చిన్నారులూ బలౌతున్నారు. ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న అశ్లీల వీడియోలు, మత్తు పదార్థాలు మనుషులను రాక్షసుల్లా మారుస్తున్నాయి.

నేడు జాతీయ బాలికల దినోత్సవం

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే రంగమేదైనా దూసుకుపోగలమని నేటి మహిళలు నిరూపిస్తున్నారు. అంతరిక్షమైనా, ఒలింపిక్స్‌లోనైనా పాల్గొంటూ దూసుకుపోతున్నారు. అదే సమయంలో బూజుపట్టిన పితృస్వామ్య భావజాలం మూలంగా ఎంతోమంది ఆడపిల్లలు చిన్న వయస్సులోనే బలవంతంగా పెళ్లి పీటలెక్కుతున్నారు. నిషేధం అమల్లో ఉన్నప్పటికీ కాసుల కక్కుర్తితో పలు ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబులు నేటికీ విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాయి. కొందరు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసేందుకు బాలికలు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సామాజిక- ఆర్థిక సవాళ్లు, సాంస్కృతిక నిబంధనలు, దూర ప్రాంత ప్రయాణాలు, భద్రతాపరమైన సమస్యలు వంటివి వారిని చదువుకు దూరం చేస్తున్నాయి. ఫలితంగా డ్రాపవుట్ రేట్లు పెరుగుతున్నాయి. చదువులకు స్వస్తి చెప్పే బాలికలు బాల కార్మికులుగా మారిపోతున్నారు. యుక్త వయస్సు రాకుండానే వివాహాలు జరుగుతున్నాయి. టీనేజీలోనే గర్భవతులవుతున్నారు. అవమానాలు, వేధింపులు, చివరికి అక్రమ రవాణాకు కూడా గురవుతున్నారు. బాలికలకు ఇంటర్ విద్యను అందించాలంటే ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూత ఇవ్వాలని, ప్రోత్సాహకాలు అందించాలనీ, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలనీ, బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని ఐద్వా వంటి మహిళా సంఘాలు కోరుతున్నాయి. ముందుగా బాలికల విద్యపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశాయి. ఐరాస మహిళా విభాగం, యునిసెఫ్ (ఆందోళన) ఐరాస మహిళా విభాగం, యునిసెఫ్‌ల నివేదిక ప్రకారం ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరు కనీసం పదోతరగతి వరకైనా చదవటం లేదు. పై చదువులకు వెళ్లిన ప్రతి 10 మంది బాలకల్లో నలుగురు ఇంటర్మీడియట్ పూర్తి చేయలేక పోతున్నారు. అల్పాదాయ దేశాల్లోని యువతుల్లో 90 శాతం అంతర్జాల సేవలను వినియోగించుకో లేకపోతున్నారు. దేశంలో ప్రతి ఐదుగురు బాలికల్లో ముగ్గురు మాత్రమే ఇంటర్ విద్యను అభ్యసిస్తు న్నారు. మిగిలిన ఇద్దరూ పదోతరగతితోనే చదువు మానేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 5 నుంచి 14 సంవత్సరాల వయస్సున్న బాలికలు తమ సమాన వయస్సున్న బాలురు కంటే ఎక్కువగా కష్టపడుతున్నారు. కుటుంబాల్లో పనిభారం ఎక్కువగా అమ్మాయిలపైనే పడుతోంది. ఎంతో మంది కౌమార బాలికలు సన్నిహితుల నుంచి లైంగిక వేధింపులకు గురౌతున్నారు. కొత్తగా హెచ్ఐవి సోకుతున్న వారిలో యువతులు పెద్దసంఖ్యలో ఉంటున్నారు. తరచూ ఎదురవుతున్న వేధింపులతో బాలికలు చదువులకు దూరమవు తున్నారు.

ఇంటా బయటా వేధింపులే...

ఇంటికి దూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లి వచ్చేటప్పుడు, బడుల్లోనూ వారు హింసకు గురౌతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి బాధితుల సంఖ్య ఆరుకోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఇలాంటి వేధింపులు తాళలేక ఏటేటా అర్థాంతరంగా చదువు ముగిస్తున్న బాలికల సంఖ్య 24.6 కోట్ల వరకూ ఉంటుందని ఓ అధ్యయనంలో యునిసెఫ్ విశ్లేషించింది. మనదేశంలో బాలికల జనాబా 25.30 కోట్లు ఉండగా జాతీయ కుటుంబ సర్వే ప్రకారం ప్రతి 1000 మంది అబ్బాయిలకు 929 మంది అమ్మాయిలు ఉన్నారు. చనిపోయే వారిలో ఎక్కువమంది ఆడపిల్లలే ఉంటున్నారు. 20 నుంచి 24 ఏళ్ల వయస్సు యువతుల్లో 23.3 శాతం 18 ఏళ్లు నిండకముందే వివాహం చేసుకుంటున్నారు. లక్షలాది ఫోక్సో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ ప్రకారం తెలంగాణాలో రోజూ సగటును ఏడుగురు మైనర్లపై లైంగిక వేధింపులు చోటు చేసుకుంటున్నాయి. వివాహ వయస్సు 21 ఏళ్లకు పెంచాలనేది ఇంకా చట్టం కాకపోవటంతో బాల్యవివాహాలు ఆగటం లేదు.

పథకాలు సరే.. రక్షణ శూన్యం

ఆడపిల్లల లింగ నిష్పత్తిని పెంచడానికి కేంద్రం బేటీ బచావో బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన, బాలిక సమృద్ధి యోజన వంటి పథకాలను తీసుకొచ్చింది. అయినా ప్రభుత్వ రంగ పాఠశాలలు, కళాశాలల్లో రక్షణ లేకుండా పోవటంతో ఆడపిల్లలు ఉన్నత విద్యకు దూరమైపోతున్నారు. కస్తూరిబా బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, ప్రత్యేక గురుకులాలు వంటివి ఉండటం వల్ల తెలుగు రాష్ట్రాల్లో కొంత మేర బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వ విద్యాలయాల్లో ఆడపిల్లలే 50 శాతానికిపైగా చదువుకుంటున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల్లో మగ పిల్లలను చేర్పిస్తున్నారు. కుటుంబం నుంచే మొదట వివక్ష మొదలవుతోంది. ఈ పరిస్థితులు మారాలి.

ప్రోత్సహిస్తే ప్రగతిపథం వైపుగా ...

అంతరిక్షం నుంచి దేశ అత్యున్నత పదవి రాష్ట్రపతి వరకూ మహిళలు ఎదుగుతున్నారు. ఆడపిల్లలంటే నేటికీ సమాజంలో వివక్ష, కుటుంబం నుంచే హింస, బయట దారుణ పరిస్థితులు ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యత, భద్రత లేమి, వరకట్న దురాచారం అవగాహనా లేమి కారణాలతో ఆడపిల్లలను పెంచి పెళ్లి చేసి పంపిస్తే మా బాధ్యత తీరిపోతుందనే పరిస్థితులు నేటికీ ఉన్నాయి. చదువుకున్న కుటుంబాల్లో కొంత పరిస్థితులు మారాయి. ప్రభుత్వ విద్యాలయాల్లో 50 శాతానికిపైగా ఆడపిల్లలే చదువు కుంటున్నారు. కొన్ని చోట్ల ఆడపిల్లలకు కుటుంబాల్లోనే లైంగిక వేధింపులు, పరువు పేరిట చంపేయటాలు సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటేటా కేవలం జాతీయ బాలిక దినోత్సవం పేరిట హడావుడి చేసి వదిలేయకుండా ఆడపిల్లలు స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం, ఎదిగేందుకు అవసరమైన కనీస వసతులు, రక్షణ చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలి. తద్వారానే ఆడపిల్లలు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి సమాజంలో మంచి భవిష్యత్తును అందుకోగలరు. సమాజాన్ని నడిపించడంలో కీలకం కాగలరు. ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. చట్టాలున్నా నిందితులకు శిక్షలు పడటం లేదు. ఫలితంగా బాలికల నిష్పత్తి నాటికీ తగ్గుముఖం పడుతోంది. పాఠశాల స్థాయి నుంచే (నైతిక విద్యను) లైంగిక విద్యను, పునరుత్పత్తి బిడ్డల జననం గురించి బోధించాలి. మత్తుమందుల కోరల్లోంచి బాలురను, సమాజాన్ని రక్షించాలి. ప్రైమరీ, సెకండరీ, హయ్యర్ సెకండరీ స్థాయిలో విద్యార్థినుల నమోదును పెంచేందుకు కషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డి.రమాదేవి,
ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్: 9490098620

పోలీసుల పహారాలో

దళిత వరుడి ఊరేగింపు

- రాజస్థాన్ కోరలు చాచిన కుల వివక్ష

పోలీసుల భద్రత మధ్య దళిత వరుడి ఊరేగింపు

జైపూర్ : రాజస్థాన్‌లో కుల వివక్ష తీవ్ర రూపు దాల్చింది. దళితులు శుభకార్యాలు చేసుకునేందుకు కూడా వీల్లేని విధంగా అక్కడి పెత్తందార్ల ఆగడాలు పెరిగిపోతున్నాయి. దీంతో దళితుల శుభకార్యాలను సైతం పోలీసుల పహారాలో నిర్వహించుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో లావెరా గ్రామంలో ఇలాంటి సంఘటనే జరిగింది. దళిత యువకుడైన విజయ్ రేగర్‌కు లావెరా గ్రామానికి చెందిన దళిత మహిళ అరుణతో పెళ్లి నిశ్చియమైంది. అయితే పెళ్లి సందర్భంగా 'బరాత్' (వరుడి ఊరేగింపు) నిర్వహిస్తే చంపేస్తామంటూ దళిత వధువును, ఆమె కుటుంబాన్ని స్థానిక పెత్తందార్లు బెదిరించారు. దీంతో వధువు తండ్రి నారాయణ మానవ్ వికాస్ అవమ్ అధికార్ కేంద్ర సంస్థాన్ కార్యదర్శి రమేష్ చంద్ బన్సాల్ సహాయంతో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లేఖ రాశారు. ఈ అంశాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించి బరాత్ జరుపుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలని అజ్మీర్ ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో 200 మంది పోలీసులతో భద్రత కల్పించడంతో ఈ నెల 21న దళిత వరుడి వివాహ ఊరేగింపు సజావుగా సాగింది. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మేళతాళాలు, డ్యాన్సుల మధ్య దళిత వధువు అరుణ ఇంటికి వరుడు విజయ్ చేరుకుని వివాహం చేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు ఈ దళిత వరుడి ఊరేగింపు వీడియో వైరల్‌గా మారింది. 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో దళితులు, ఇతర అణగారిన తరగతులకు స్వేచ్ఛ సిద్ధించడం లేదని, మనుధర్మ వ్యవస్థ సృష్టించిన కుల రక్కసి ఇప్పటికీ వేధిస్తూనేవుందని సామాజిక కార్యకర్తలు ఈ వీడియోపై స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటన దేశానికే సిగ్గు చేటని స్థానిక కుల వివక్ష వ్యతిరేక ఉద్యమ నాయకులు సురజ్ కుమార్ బౌద్ధ విమర్శించారు. పెత్తందార్ల గూండాల దాడి భయంతో పోలీసుల నిఘా నీడలో శుభకార్యాలయాలు చేసుకునే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొనడం చాలా దారుణమన్నారు. ఊరేగింపులో వధు, వరుల బంధువులు కంటే పోలీసులే ఎక్కువగా ఉన్నారని అశ్చర్యం వ్యక్తం చేశారు. దేశంలో దళితులు పెళ్లి కూడా ప్రశాంతంగా జరుపుకోలేకపోతుండటం సిగ్గుచేటు అని ఆయన పేర్కొన్నారు.

రంజీట్రోఫీలో స్టార్ క్రికెటర్లు విఫలం

రోహిత్, జైస్వాల్, గిల్, పంత్ సహా రహానే, పుజారా కూడా..!

ముంబయి: రంజీ ట్రోఫీ రెండో అంచె పోటీల్లో టీమిండియా స్టార్ బ్యాటర్లకు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఒకరో, ఇద్దరో కాదు.. ఏకంగా ఐదుగురు టీమిండి యా స్టార్ ఆటగాళ్లు ఇలా ఔటవ్వడంతో బిసిసిఐ అధికారులకు దిక్కుతోచడం లేదు. గురువారంనుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ పోటీల్లో భాగంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మొదలుకుని.. వెటరన్లు రహానే, పుజారా, హనుమ విహారి వరకు అంతా దారుణంగా విఫలమయ్యారు. భారత టెస్ట్ జట్టు సభ్యులు రోహిత్(3), జైస్వాల్(4), శుభ్‌మన్ గిల్(4), రిషభ్ పంత్(1) సింగిల్ డిజిట్ స్కోర్లకే ఔట్ కాగా.. భారత వన్డే జట్టు సభ్యుడు శ్రేయస్ అయ్యర్ (11), టీమిండియా భవిష్యత్తు తార రుతురాజ్ గైక్వాడ్(10) స్వల్ప స్కోర్లకే నిష్క్రమించారు. అలాగే గతంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడిన భారత క్లాసికల్ బ్యాటర్లు రహానే(12), పుజారా(6), హనుమ విహారి(6) కూడా తక్కువ స్కోర్లకే ఔటై నిరాశపరిచారు. విధ్వంసకర ఆటగాళ్లు రజత్ పాటిదార్(0), శివమ్ దూబే(0)లది కూడా ఇదే వరుస.

జడేజా ఒక్కడే...

టీమిండియా ఆటగాళ్లలో ఎవరైనా సత్తా చాటారా? అంటే అది ఒక్క రవీంద్ర జడేజా మాత్రమే. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో జడేజా ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. జమ్మూ-కాశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్(51) మెరుపు అర్ధ సెంచరీ చేసి ముంబయిని ఆదుకున్నాడు.

ఆంధ్ర 245/7

పుదుచ్చేరి వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో ఆంధ్ర ఓపెనర్ రషీద్(105) సెంచరీకి తోడు శశికాంత్(57) అర్ధసెంచరీతో మెరిసాడు. పాండిచ్చేరితో గురువారం నుంచి ప్రారంభమైన రంజీట్రోఫీ రెండో లీగ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 245పరుగులు చేసింది. క్రీజ్‌లో శశికాంత్‌కి తోడు పృథ్వీరాజ్(6) ఉన్నారు. పాండిచ్చేరి బౌలర్లు మాథ్యూ, అంకిత్ శర్మకు మూడేసి వికెట్లు దక్కాయి.

తన్మయ్ సెంచరీ...

హిమాచల్‌ప్రదేశ్‌తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ (137) అజేయ శతకంతో మెరిసాడు. అభిరథ్‌రెడ్డి (73), రాహుల్ రాదేశ్(52) రాణించడంతో హైదరాబాద్ జట్టు తొలిరోజు ఆట ముగిసేసరికి 2వికెట్ల నష్టానికి 291పరుగులు చేసింది.

'బుల్లిరాజు'కు ఆఫర్లు

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో బుల్లిరాజుగా నటించిన భీమాల రేవంత్‌కు మరికొన్ని సినిమాల్లో నటించాలని ఆఫర్లు వస్తున్నాయి. ఈ సినిమాలో 'కొలికేత్తాను' అంటూ నవ్వుల జల్లు కురిపించాడు. డ్యాన్సులు సైతం చేశాడు. నటన కూడా వైవిధ్యంగా ఉండటంతో దర్శకులు, నిర్మాతలు ఈ కుర్రాడికి అవకాశాలు ఇవ్వాలని చూస్తున్నారు. బుల్లిరాజుకు మరిన్ని అవకాశాలు వస్తున్నాయని ఇటీవల జరిగిన పాత్రికేయుల సమావేశంలోనే కథానాయకుడు వెంకటేష్ ప్రకటించారు. మంచి భవిష్యత్తు ఉందంటూ అనిల్ రావిపూడి కూడా అభినందించారు. సంక్రాంతికి వస్తున్నాం సీక్వెల్‌లో బుల్లిరాజు పాత్రను ఎక్కువగా పెంచాలని చిత్ర యూనిట్ ఇప్పటికే నిర్ణయించినట్లుగా సమాచారం.

ట్రెండింగ్‌లో ఎఐ వీడియోలు

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ కథానాయకులతో కొందరు అభిమానులు ఎఐ సహాయంతో తయారుచేసిన ఫొటోలు, వీడియోలు ట్రెండింగ్ అవుతున్నాయి. అగ్రహీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్, విజయ్, అజిత్‌కుమార్ సహా పలువురికి సంబంధించిన ఏఐ ఫొటోలు ట్రెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం, పాత ఫొటోలు పెట్టి తయారుచేసిన ఫొటోలు, అందరు హీరోలు కలిసివున్నట్లుగా తయారుచేశారు. పాత, కొత్త లుక్‌తో అలరిస్తున్నాయి. కొన్ని ఫొటోలు తమ అభిమాను కథానాయకుల ఫొటోలకు దూరపు ఛాయలు ఉండటంతో కామెంట్లు సైతం చేస్తున్నాయి.

రెండేళ్లుగా రాసే పద్ధతి పాటిస్తున్నాం : సమంత

'రైటింగ్ అనేది మీకు సహజంగా వస్తే ఈ రోజు మీరు కృతజ్ఞతతో ఉన్న మూడు విషయాలను రాయండి. అవి పెద్దగా ఉండాల్సిన అవసరం లేదు. కేవలం నిజాయితీగా ఉండాలి. కానీ రాయడం కష్టంగా, బలవంతంగా అనిపిస్తే మీరు బాగా విశ్వసించే వారితో షేర్ చేయండి. అంతేకాదు ఏమీ చేయక పోయినా కొన్నిసార్లు సైలెంట్‌గా కూర్చున్నా చాలు. ఈ చిన్న అభ్యాసం మొదట చాలా సింపుల్‌గా అనిపించొచ్చు. కానీ ప్రతిదీ మీరు చూసే విధానాన్ని మార్చే శక్తిని కల్గివుంటుంది. ఒకసారి ప్రయత్నించండి. ఇది నాకు గేమ్‌ఛేంజర్‌గా మారింది' అని కథానాయిక సమంత అన్నారు. సిటాడెల్ హన్నీ బన్నీ వెబ్‌సిరీస్‌లో ఆమె నటించారు. ఇందులో వరుణ్‌ధావన్‌తో కలిసి మెప్పించారు. ప్రస్తుతం పెద్దగా సినిమాల్లో కనిపించకపోయినా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూ తన పర్యటనల సమాచారాన్ని తెలియజేస్తున్నారు. తాజాగా ఆమె చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత రెండేళ్లుగా తాను పాటిస్తున్న పద్ధతి గురించి అందులో పై విధంగా తెలియజేశారు.

అమ్మాయి గెటప్ ఫొటో వాడొద్దు: విశ్వక్‌సేన్

తాను నేను అమ్మాయి గెటప్‌లో ఉన్న ఫొటోను దేనికి పడితే దానికి వాడేస్తున్నారనీ, అలా చేయొద్దని కథానాయకుడు విశ్వక్‌సేన్ అన్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆయన నటించిన కొత్త సినిమా ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే ఫస్ట్ లిరికల్ సాంగ్ విడుదలై ట్రెండింగ్‌లో ఉంది. గురువారంనాడు రెండోపాటను కూడా నిర్మాతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వక్‌సేన్ మీడియాతో మాట్లాడతూ కొత్త సినిమాలో తన పాత్ర గురించి మాట్లాడారు. అమ్మాయి గెటప్ ఉన్న ఫొటోను గతంలో మేకర్లు విడుదల చేశారు. దీనికి ఆయన పై విధంగా స్పందించారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సాహు గారపాటి నిర్మిస్తున్నారు.

ఫైనల్‌కు సబలెంక, కీస్

- నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక ప్రవేశించింది. మరో ఉత్కంఠ పోరులో 19వ సీడ్ మాడీసన్ కీస్.. 2వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్‌ను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించింది. ఏకపక్షంగా సాగిన తొలి సెమీస్‌లో టాప్‌సీడ్ సబలెంక 6-4, 6-2తో సంచలన విజయాలతో సెమీస్‌కు చేరిన 11వ సీడ్, స్పెయిన్‌కు చెందిన బడోసాను చిత్తుచేసింది. ఇక రెండో సెమీస్‌లో కీస్ సంచలనం నమోదు చేసింది. మాజీ టాప్‌సీడ్ ప్లేయర్ ఇగా స్వైటెక్‌పై తొలి సెట్‌ను 5-7తో చేజార్చుకొని రెండో సెట్‌ను 6-1తో చేజిక్కించుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా.. ఆ సెట్‌ను (7-6(10-8)తో చేజిక్కించుకొని మ్యాచ్‌ను ముగించింది. శనివారం జరిగే ఫైనల్లో కీస్.. టాప్‌సీడ్ సబలెంకతో తలపడనుంది.

నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్...

జకోవిచ్(7) × జ్వెరేవ్(2)(ఉ.9.00గం॥లకు)
సిన్నర్(1) × షెల్టన్(21)(మ.2.00గం॥లకు)

సూపర్-6కు భారత్

- శ్రీలంకపై 60పరుగుల తేడాతో గెలుపు
- ఐసిసి అండర్-19 మహిళల ప్రపంచకప్

కౌలాలంపూర్: ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్ వరుసగా మూడో విజయాన్ని సొంతం చేసుకొని సూపర్-6కు చేరింది. గ్రూప్-ఏలో భాగంగా శ్రీలంకతో గురువారం జరిగిన చివరి గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారత్ 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. ఓపెనర్ త్రిష (49; 44 బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) మెరుపు ఇన్నింగ్స్ ఆడి టీమిండియా గౌరవప్రదమైన స్కోర్ సాధించేలా చేసింది. త్రిషతో పాటు భారత్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ నికీ ప్రసాద్(11), మిథిలా వినోద్(16), వీజే జోషిత(14) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జి కమలిని 5, సినిక ఛల్కే 0, భవిక అహిరే 7, ఆయుషి శుక్లా 5, పరునిక సిసోడియా ఒక్క పరుగు చేసి ఔటయ్యారు. షబ్నమ్ షకీల్ (2), వైష్ణవి శర్మ (1) అజేయంగా నిలిచారు. లంక బౌలర్లలో ప్రముది మెత్సర, లిమాంస తిలకరత్న, అసెని తలగుణె తలా రెండేసి వికెట్లు పడగొట్టగా... రష్మిక సేవండి, చమోది ప్రభోద, కెప్టెన్ మనుడి ననయక్కార తలో వికెట్ దక్కించుకున్నారు. 119 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంకను భారత బౌలర్లు 58పరుగులకే పరిమితం చేశారు. వైష్ణవి శర్మ(1/3), షబ్నమ్ షకీల్(2/9), పరునిక సిసోడియా(2/7), విజె జోషిత(2/17), ఆయుషి శుక్లా (1/13) ధాటికి శ్రీలంక నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి కేవలం 58 పరుగులు మాత్రమే చేయగలిగింది. వైష్ణవి శర్మ సంధించిన బంతులను ఎదుర్కోలేక లంక బ్యాటర్లు నానా అవస్థలు పడ్డారు. లంక ఇన్నింగ్స్‌లో రష్మిక (15) రెండంకెల స్కోర్ చేశారు. కాగా, ఈ టోర్నీలో భారత్.. వెస్టిండీస్, మలేసియా, శ్రీలంక జట్లపై ఘన విజయాలు సాధించి సూపర్-6లోకి ప్రవేశించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68